ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 36.0
కనిష్ఠం 24.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 15 జూలై 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	554 (218.6760)	63,900	1,650
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.48 (3.52)	-	167.79
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	154.034 (19.2030)	-	5,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



ఎన్ని నిధులైనా ఇస్తా..
తుంగతుర్తిని అభివృద్ధి చేస్తా

- తిరుమలగిరి సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- పదేళ్లలో అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం
- నూతన రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం
- హాజరైన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, అడ్లూరి, పొంగులేటి

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట/మోత్కూరు)

కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్న తుంగతుర్తి నియోజకవర్గానికి ఎన్ని నిధులైనా ఇస్తామని, అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్ల అవకాశం ఇస్తే చేయని వారు ఇప్పుడు మాట్లాడుతున్నారని, దేవాదుల ద్వారా గోదావరి జలాలను అందించే వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం విశ్రమించదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతన రేషన్‌కార్డుల పంపిణీని సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సీఎం సోమవారం ప్రారంభించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమా ర్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మొదటగా తిరుమలగిరి పట్టణానికి చెందిన మహ్మద్ రజియా బీతో పాటు మరో 10 మందికి నూతన రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం సభలో సీఎం మాట్లాడుతూ ప్రతిపక్షం బీఆర్ఎస్ వైఫల్యాలను ఏకరువు పెడుతూనే విమర్శలను గుప్పించారు. పదేళ్ల మీరు ఎట్లున్నారు అని అడిగినవాళ్లు ఉన్నారా అక్కలు అంటూ తమ ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం చేప ట్టిన పథకాలను వివరించారు.

మహాలక్ష్మి పథకం కింద ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం తమకు ఖర్చు కింద కాదని, ఆడబిడ్డలకు కానుకగా తమ ప్రభుత్వం భావిస్తోందని, సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీలో ఆరు వందల బస్సులు, పెట్రోల్ బంక్‌లు మహిళలకే కేటాయిస్తూ వారిని కోటీశ్వరులను చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. జీరో వడ్డీ కింద రూ.21 వేల కోట్లు అప్పులిప్పిచ్చి, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకరిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం బెల్ట్ దుకాణాలు తెరిస్తే, తమ ప్రజాప్రభుత్వం రేషన్ దుకాణాలు తెరిచి కొత్త రేషన్‌కార్డులు, సన్నబియ్యం అందించి పేదల కడుపునింపుతోందన్నారు.

ఇది రైతు ప్రభుత్వం

ఎవరు అవునన్నా, కాదన్నా ఇది ముమ్మాటికీ రైతు ప్రభుత్వమేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా రాదని వగల ఏడుపు ఏడ్చిన వారికి తొమ్మిది రోజుల్లో రూ.9 వేలకోట్లు వేసి సమాధానమిచ్చామన్నారు. ఆగస్టు 15నాటికి రూ.21 వేల కోట్లు రుణమాఫీ కూడా పూర్తవుతుందన్నారు. రైతు భరోసా ఎగ్గొడితే బాగుండు, మాపంట పండు అని బీఆర్ఎస్ అనుకుంటే రైతులకు సంక్షేమ పథకాలు అందజేసి వారి కళ్లలో ఆనందాన్ని చూశామన్నారు. రాష్ట్రాన్ని పదేళ్ల పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం ఇవ్వాలన్న ఆలోచన కూడా రాలేదన్నారు.

పదేళ్లు ఏం చేశారు

మూడు రోజులిస్తే గోదావరి

- మిగతా 7వ పేజీలో...





సభకు హాజరైన ప్రజలు, అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన వెంట మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు, ఎంపీ చామల

సన్నబియ్యం, రేషన్‌కార్డులు చరిత్రాత్మక పథకాలు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మోత్కూర్/తిరుమలగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు సన్నబియ్యం, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ చరిత్రాత్మక పథకాలని నీటిపారుదల, పౌరసరఫరాల మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరి సభలో ఆయన మాట్లాడుతూ, గత ఉగాది రోజున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం హుజూర్‌నగర్‌లో ప్రారంభించామని, నేడు రాష్ట్ర వ్యాప్తంగా రేషన్‌కార్డుల కార్యక్రమాన్ని తుంగతుర్తి గడ్డ మీదుగా ప్రా రంభించడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభు త్వం 2.80కోట్ల మందికి రేషన్ బియ్యం ఇవ్వగా, దొడ్డు బియ్యం పేదలు తినేవారు కాదని, రీసైక్లింగ్‌కు...

- మిగతా 7వ పేజీలో..

బీజేపీలోనే సామాన్యులకు అవకాశం

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

నల్లగొండ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఒక్క బీజేపీలో మాత్రమే సామాన్యులకు అవకాశాలు దక్కుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తరువాత తొలిసారి జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన ఆయనకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు మర్రిగూడ బైపాస్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అన్నదమ్ములు, తండ్రీకుమారులు, భార్యభర్తలు పలు పార్టీల్లో చేరి ఎన్నికల్లో పోటీచేస్తూ కుటుంబ పాలన సాగిస్తున్నారని, ఒక్క బీజేపీలో మాత్రం సామాన్యులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ద్వారా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయని ప్రభుత్వంపై కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే ఇచ్చి పేదలకు అన్యాయం చేశారన్నారు. రేషన్ కార్డులను పేదలకు ఇవ్వకుంటే కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పోరాడాలన్నారు. దళారులకు రేషన్‌కార్డులు ఇస్తే ఊరుకునేది లేదన్నారు. ఎస్ఎల్‌బీసీ పేరు చెబుతున్నారు తప్ప ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టును పూర్తిచేయలేదని, అందులో కూరుకుపోయిన మృతదేహాలను వెలికితీయలేని అసమర్థ ప్రభుత్వమన్నారు. రేషన్ కార్డు ఉన్న వారికి 5కిలోల బియ్యం ఇస్తున్నది మోదీ ప్రభుత్వం కాదా? పంచాయతీలకు నిధులు ఇచ్చింది బీజేపీ ప్రభుత్వం కాదా? సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నా రు. అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులు గజమాలలతో రామచందర్‌రావును సత్కరించారు. తొలుత వీటీ కాలనీ శ్రీదేవిభూదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రామచందర్‌రావు దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సమీపంలోని పార్క్‌లో మొక్క నాటారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కాసం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జి.మనోహర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, శానంపూడి సైదిరెడ్డి, చింత సాంబమూర్తి, గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు యాదవ్, పల్లెబోయిన శ్యాంసుందర్, పోతేపాక సాంబయ్య, బొజ్జ నాగరాజు, మిర్యాల వెంకటేశం, దాయం భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, పోతేపాక లింగస్వామి, కనకాల నాగిరెడ్డి, పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరేనా?

- గత ఏడాది రెండో నంబర్ టర్బైన్ మరమ్మతులు
- ఈ ఏడాది ఒకటో నంబరు టర్బైన్ మరమ్మతు
- వరద వచ్చేనాటికి పూర్తికాని పనులు

ఉభయ తెలుగు రాష్ట్రాలకు వెలుగులు అందించే బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం చేరడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మూడేళ్లుగా ఏదో ఒక టర్బైన్ మరమ్మతులకు గురవుతోంది. వాటి మరమ్మతులు సాగర్‌కు వరద వచ్చే నాటికి పూర్తి చేయాల్సిన జెన్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎగువ నుంచి జలాశయానికి వరద వచ్చాక కూడా మరమ్మతులు పూర్తవడం లేదు. దీంతో జలాశయంలో సమృద్ధిగా నీరున్నా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని మించడం లేదు.

- (ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)



నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్‌లు ఉన్నాయి. అందులో మొదటి టర్బైన్ మన దేశానికి చెందిన బీహెచ్‌ఈఎల్ కంపెనీ రూపొందించింది. కాగా, మిగిలిన ఏడు టర్బైన్‌లు జపాన్ టెక్నాలజీకి చెందినవి. అందులో బీహెచ్‌ఈఎల్ టర్బైన్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 110 మెగావాట్లు కాగా, మిగిలిన ఏడు టర్బైన్ల ఒక్కో దాని సామర్థ్యం 100.6 మెగావాట్లు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 815.6 మెగావాట్లు కాగా, 2023 నవంబరు నెలలో రెండో నంబర్ టర్బైన్ మరమ్మతులకు గురైంది. ఆ టర్బైన్ మరమ్మతులు వెంటనే చేపట్టలేదు. ఏడాదిన్నర తర్వాత టర్బైన్‌కు మరమ్మతులు చేయించగా, తాజాగా ఈ ఏడాది మొదటి టర్బైన్ మరమ్మతులకు గురైంది. దీంతో రూ.7.50కోట్ల వ్యయంతో ఈ ఏడాది ఏప్రిల్ 10న మొదటి టర్బైన్ మరమ్మతు పనులను అధికారులు ప్రారంభించారు. కానీ, నేటికీ ఈ పనులు పూర్తికాలేదు. ఈ టర్బైన్ మరమ్మతులకు మరో నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక ప్రారంభమైంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఎనిమిది టర్బైన్ల ద్వారా ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉండగా, అధికారులు మాత్రం మరమ్మతుల పనుల్లో వేగం పెంచకుండా నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతీ ఏట సాగర్‌కు వరద వచ్చే సమయం నాటికి ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ టర్బైన్ల మరమ్మతులు పూర్తిచేసి, సర్వీసింగ్ చేసి ఉత్పత్తిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి. అయితే జెన్‌కో అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంటాం

ఈ ఏడాది సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని 1,450 మిలియన్ యూనిట్లుగా ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆ లక్ష్యాన్ని చేరుకుంటాం. గత ఏడాది కూడా ఏడు టర్బైన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నాం.

- మంగేష్‌కుమార్, జెన్‌కో సీఈ

ఐదేళ్లలో సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి ఇలా..

సంవత్సరం	లక్ష్యం (మి.యూ)	ఉత్పత్తి (మి.యూ)	వినియోగించిన నీరు (టీఎంసీలు)
2020-21	1290	1248.78	184.15
2021-22	1535	2262.52	335.37
2022-23	1500	2355.62	347.82
2023-24	1400	540.84	95.84
2024-25	1400	1922.26	283.90
2025-26	1450	164.30	28.77

(జూలై 13వ తేదీ నాటికి)

2023-24 ఆర్థిక సంవత్సరంలో సాగర్ జలాశయానికి వరద రాలేదు. దీంతో ఆ ఏడాది ప్రాజెక్టు పరిధిలో క్రాప్ హాలిడే ప్రకటించారు. ఆ ఏడాది ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేదు.

సీఎంకు, మంత్రులకు పాలనపై అవగాహన లేదు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

మిర్యాలగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సీఎం, మంత్రులకు పాలనపై అవగాహన లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ విమర్శించారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డుల పంపిణీకి సీఎం సభ పెట్టడమేంటని, అదేమైనా కొత్త పథకమా అని ప్రశ్నించారు. కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ నేతలు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని, బడ్జెట్‌లో రూ.20వేల కోట్ల నిధులు కేటాయిస్తామని, ఎం బీసీ సంచార జాతులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి 19నెలలు దాటినా ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనను కేంద్ర ప్రభుత్వం తప్పుపట్టిందన్నారు. చట్టసభలో చేసిన తీర్మానాన్ని కేంద్రం 9వ షెడ్యూల్‌లో పెట్టి పార్లమెంట్‌లో చర్చించి, రాష్ట్రపతి ఆమోదిస్తేనే రిజర్వేషన్ అమలు అవుతుందనే విషయం పాలకులకు తెలియదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదిస్తారా? కోర్టులో నిలబడుతుందా అనేది సందేహమేనని అన్నారు. కవితను అవమానించిన ఎమ్మెల్సీ మల్లన్న బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల కోట్ల రుణం తెచ్చి ఏ ఒక్క కొత్త ప్రాజెక్టును నిర్మించలేదన్నారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ నేతలకు పాలన చేతగాక ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ, నాగార్జునసాగర్‌లో 550 అడుగుల వరకు నీరు చేరిందని, వెంటనే సాగర్ ఎడమకాల్వకు నీరు విడుదల చేసి ఆయకట్టులో సాగుకు తోడ్పాటు అందించాలన్నారు. యాదాద్రి పవర్ ప్లాంటు నిర్మాణంలో భూములు కోల్పోయిన 578 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, దుర్గం పూడి నారాయణరెడ్డి, అన్నభీమోజు నాగార్జునాచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిట్టిబాబు నాయక్, బాలాజీ నాయక్, వీరకోటిరెడ్డి, యూసుఫ్, రవినాయక్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్, తిరందాసు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు, విత్తనాలు అందించాలి

ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య



డీఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎఫ్ నాయకులు

మిర్యాలగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత కిసాన్ సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఏవో శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మట్టయ్య మాట్లాడుతూ, డీలర్లపై రవాణా చార్జీలు విధిస్తుండటంతో వారు ఆ భారాన్ని రైతులపై మోపుతున్నారని అన్నారు. రైతులు ఘన రూపంలో ఉన్న యూరియా వినియోగానికి మొగ్గుచూపుతుండగా, ప్రభుత్వం సగానికి తగ్గించాలని చూస్తోందన్నారు. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో 3లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, 1.5లక్షల టన్నుల ఘన రూప యూరియానే సరఫరా చేసిందన్నారు. నానో యూరియాను తీసుకున్న రైతులకే ఘన రూప యూరియా, డీఏపీ ఇస్తామని లింక్ పెట్టడం సరికాదన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, ధరావత్ మోహన్‌నాయక్, గడ్డి వీరయ్య, లాలునాయక్, మౌనిక, జ్యోతి, సందీప్, శారద, ముత్తయ్య ఇమ్మానియల్, కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా హాఫీజ్‌ఖాన్



నల్లగొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మహ్మద్ హాఫీజ్‌ఖాన్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ హాఫీజ్‌ఖాన్ 1985 నుంచి కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా, పీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా, ఏఐసీసీ సభ్యుడిగా, పీసీసీ స్పోక్ మెంబర్‌గా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలకు ప్రభుత్వం ఆయన్ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంక్ అభివృద్ధి కృషి చేయాలి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



కుంభం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు

నల్లగొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అభివృద్ధికి అధికారులు, ఉద్యోగులు కష్టపడి మంచి ఫలితాలు సాధించాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. బ్యాంక్ మంచి పురోగతిలో ఉందని, అభివృద్ధి దిశలో పయనిస్తున్నా మరింత కష్టపడితే రాష్ట్రంలో మొదటి స్థానానికి చేరుకుంటుందన్నారు. పాలకవర్గ సహకారం, అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో బ్యాంక్ రూ.3వేల కోట్ల టర్నోవర్ దశలో ఉందన్నారు. ఇటీవల నాఫ్స్కాబ్ డైరెక్టర్ పదవితో పాటు పుట్టిన రోజు సందర్భంగా కుంభం శ్రీనివాస్‌రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లుపాశం సంపత్‌రెడ్డి, కొండా సైదయ్య, వీరస్వామి, ధనావత్ జయరాం, కోడి సుష్మ, సీఈవో శంకర్‌రావు, జీఎం నర్మద, తదితరులు పాల్గొన్నారు.

వెంటనే పునరావాసం కల్పించాలి

- చర్లగూడ భూ నిర్వాసితులు
- కట్ట పనుల అడ్డగింత, కార్యాలయం వద్ద దీక్ష



క్యాంపు కార్యాలయం వద్ద నిరహార దీక్ష చేపట్టిన చర్లగూడెం భూ నిర్వాసితులు

మర్రిగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పునరావాసం కల్పించి, ఆర్అండ్ఆర్ చెల్లించాలని చర్లగూడెం భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. సోమవారం కట్ట నిర్మాణ పనులను అడ్డుకొని క్యాంపు కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ, డిండి ఎత్తి పోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న చర్లగూడ రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 2015 గత ప్రభుత్వం పరిహారం చెల్లించినా, పునరావాసం, ఆర్ అండ్ఆర్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రిజర్వాయర్‌తో 335 గృహాలు ముంపునకు గురైనట్లు డీఎల్ఐఎస్ సర్వే ద్వారా గుర్తించారన్నారు. అంతకుముందు చర్లగూడెం రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులు నిర్వహిస్తున్న యంత్రాలను భూనిర్వాసితుల కమిటీ అడ్డుకొని పనులను నిలిపివేసింది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఈఈ రాములు, డీఈ కాశీం పోలీసులతో కలిసి కట్ట వద్దకు చేరుకొని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో పరిష్కరిస్తామని, పనులను అడ్డుకోవద్దని నచ్చజెప్పారు. అయినా నిర్వాసితులు వినకుండా న్యాయం జరిగేంత వరకు క్యాంప్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. దీంతో అధికారులు చేసేదిలేక వెనుదిరిగారు. అనంతరం నిర్వాసితులు క్యాంపు కార్యాలయంవద్ద దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో చర్లగూడెం భూనిర్వాసితుల కమిటీ సభ్యులు వల్లములు రాంకోటి, మాదగోని మహేష్, మాదగోని శ్రీనివాస్, కేశవులు, కొండయ్య, బాస్కర్, సుగుణమ్మ, యాదమ్మ సత్తమ్మ, స్వాతి, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టును దర్శించుకున్న ఇంటలిజెన్స్ ఎస్పీ శిరీష



శిరీషకు స్వామివారి శేష వస్త్రాలు అందజేస్తున్న ఈవో

నార్కట్‌పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని ఇంటలిజెన్స్ ఎస్పీ శిరీష కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. తొలుత ప్రధానాలయం జడల రామలింగేశ్వర స్వామి మూలమూర్తి వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానంపై ఉన్న ఇతర ఉపాలయాలను దర్శించుకున్నారు. వారికి చెర్వుగట్టు క్షేత్రం విశిష్టతను ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ వివరించి వేదాశీర్వచనం చేయగా, ఈవో సిరికొండ నవీన్‌కుమార్ సన్మానించారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు రాధమ్మ మృతి


రాధమ్మ(ఫైల్)

కోదాడరూరల్, జూలై14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ గ్రామానికి చెందిన జలగం రాధమ్మ(100) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. సూర్యాపేట దగ్గరలోని నాసింపేటలో జన్మించిన రాధమ్మ 1945-48 మధ్య కాలంలో జరిగిన స్వాతంత్ర్య పోరా టంలో పాల్గొన్నారు. రజాకార్లపై జరిగిన సాయుధ పోరాటంలోనూ పాల్గొన్నారు. 1952 నుంచి మొదటి సాధారణ ఎన్నికలు మొదలు 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఆమె ఓటు హక్కు వినియోగించున్నారు. రాధమ్మ భర్త అంతయ్య 1997లో మృతిచెందారు. రజాకారుల ఆగడాలపై అలుపెరగని పోరాటం చేశారు. వంద సంవత్సరాలు జీవించిన ఆమెను మనువళ్లు, మునివళ్లు ఇటీవల ఘనంగా సన్మానించారు. ఆమె మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్..


వెంకటేశ్వర్లు(ఫైల్)

భువనగిరిటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో గుండెపోటుకు గురై భువనగిరి టౌన్ హెడ్ కానిస్టేబుల్ పి. వెంకటేశ్వర్లు(41) సోమవారం మృతిచెందాడు. మెడికల్ కేసులు చూసే అతను విధుల నిర్వహణలో భాగంగా సోమవారం హైదరాబాద్ వెళ్లాడు. ఈ క్రమంలో తీవ్ర అలసటకు గురైన అతనిని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి వెళ్లగా చికిత్స ప్రారంభమైన కొద్దిసేపటికే మృతిచెందాడు. వెంకటేశ్వర్లు స్వగ్రామం రంగారెడ్డి జిల్లా మంచాల మండలకేంద్రం. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతి పట్ల పట్టణ పోలీసులు సంతాపం తెలిపారు.

చికిత్సపొందుతూ మాజీ వార్డు సభ్యురాలు

కనగల్: నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని బోయినపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు లక్ష్మమ్మ ఈ నెల 8న వేములపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందారు. సోమవారం ఆమె నివాసం వద్ద లక్ష్మమ్మ మృతదేహంపై కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

వ్యసనాలకు బానిసై..

దేవరకొండ, జూలై 14(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని సంజయ్‌కాలనీలో సోమవారం జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమునిగల్‌కు చెందిన హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కొండల్ దేవరకొండలో స్థిరపడ్డాడు. కొండల్‌కు ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు కానుగుల కార్తీక్(19) కొంతకాలం అమ్మమ్మ ఊరైన పీఏపల్లి మండలం రంగారెడ్డిగూడెంలో ఉంటూ హెయిర్ కటింగ్ పనినేర్చుకుంటూ పనిమానేశాడు. స్నేహితులతో జులాయిగా తిరిగేవాడు. ఆదివారం దేవరకొండకు చేరుకున్న కార్తీక్ సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కార్తీక్ తండ్రి కొండల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతంతో

చిట్యాలరూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఆదివారం జరిగింది. ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం ఇరిగేపల్లి గ్రామానికి చెందిన జంగా లక్ష్మారెడ్డి(43) వెలిమినేడు శివారులో గల రాంకీ ఎస్టేట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ వెలిమినేడులో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. దుస్తులు ఉతికి దండెంగా కట్టిన ఇనుప జీ వైరుపై ఆరేసే సమయంలో విద్యుత్ సరఫరా జరిగి విద్యుదాఘాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు సోమ వారం లక్ష్మారెడ్డి తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైస్‌మిల్లులో పడి ఆపరేటర్

పెన్‌పహాడ్, జూలై 14(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లు పై నుంచి పడి ఆపరేటర్ మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని న్యూ బంజారా హిల్స్ తండా గ్రామపంచాయతీ పరిదిలో గల శ్రీ మహాలక్ష్మీ మోడ్రన్ రైస్‌మిల్లులో సోమవారం జరిగింది. ఆపరేటర్‌గా పనిచేస్తున్న సలిగంటి సోమయ్య(48) మిల్లు పై నుంచి కిందికి ప్రమాదవశాత్తు పడిపోవడంతో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు సలిగంటి సోమయ్యది గరిడేపల్లి మండలం కుతుబ్‌షాపురం గ్రామం. రైస్‌మిల్లు ఓనర్ వెంకన్న తన తండ్రి చావుకు కారణమని మృతుడి కుమారుడు సలిగంటి వినీత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యాదగిరి తెలిపారు. సోమయ్యకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట రూరల్, జూలై 14,(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నల్లచెరువు పరిసర ప్రాంతంలో గుర్తుతెలియని కుళ్లిపోయిన మగవ్యక్తి మృతదేహం లభించింది. సంఘటనా స్థలం వద్ద ఎలాంటి ఆనవాలు లేవు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

నిందితుడికి రెండేళ్ల జైలు, జరిమానా

నిడమనూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): వివాహితను వేధించిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి టీ. స్వప్న తీర్పు వెల్లడించారు. కోర్టు లైజన్ అధికారి అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. 2015 డిసెంబరు 18న నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో పెద మాము అంజయ్య అర్థరాత్రి ఒంటి గంట సమయంలో ఓ మహిళ ఇంటికి వెళ్లి తలుపు కొట్టగా తన భర్త వచ్చాడని భావించిన ఆమె తలుపు తీసింది. ఆమె చెయ్యి పట్టుకుని లైంగికంగా వేధించాడు. దీంతో భయంతో ఆమె కేకలు వేసింది. ఇరుగు పొరుగు రావడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు మరోసటిరోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ నర్సింహరాజు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సోమవారం కేసు విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.మూడు వేల జరిమానా విధించారు. ఒకవేళ జరిమానా చెల్లించనిపక్షంలో నిందితుడు అదనంగా నెల రోజుల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు పీసీ నవీన్ కేసు విచారణకు సహకరించారని లైజన్ అధికారి తెలిపారు.

చిట్యాలలో పట్టపగలే చోరీ

చిట్యాల, జూలై 14, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని ఓ ఇంట్లో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... చిట్యాల గ్రీన్‌గ్రోవ్ స్కూల్ సమీపంలో బత్తిని మహేష్ నివాసముంటున్నాడు. ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న అతను ఉదయమే కంపెనీకి వెళ్లాడు. భార్య కుట్టుమిషన్ నేర్చుకోవడానికి ఇంటికి తాళం వేసి సెంటర్‌కు వెళ్లింది. మధ్యాహ్నం ఆమె ఇంటికి తిరిగివచ్చి చూడగా తాళం తీసి ఉంది. బీరువా తెరిచి చూడగా అందులోని రెండు లాకెట్లు గల చైన్లు, ఆరు బంగారు ఉంగరాలు, ఒక జత మాటీలు, రెండు జతల వెండి కాళ్ల పట్టీలు, ఒక వెండి పళ్లెం, వెండి గ్లాసు కన్పించకపోవడంతో భర్తకు ఫోన్‌చేసింది. మహేష్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

మఠంపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట మండలంలోని జమ్లాతండాలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతు మస్రు చెందిన పాడిగేదె ఉదయం తండా సమీపంలో మేతకు వెళ్లింది. మేత మేస్తున్న క్రమంలో పొలంలో మోటర్ పక్కన విద్యుత్ సరఫరా అవుతున్న తీగకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. వ్యవసాయ కూలీలు, రైతులు గమనించి రైతుకు సమాచారం ఇచ్చారు. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

చినుకు జాడేదీ


కేతేపల్లి మండలంలో వర్షాభావంతో ఎదుగుదల లేకుండా వాడిపోతున్న పత్తి మొక్కలు

- ఆందోళనలో జిల్లా రైతాంగం
- 5లక్షల ఎకరాల్లో విత్తనాలు వేసిన రైతులు
- వారంలోపు వర్షాలు రాకుంటే కష్టమే

నల్లగొండ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇప్పటికీ ఎండలు తగ్గుముఖం పట్టడం లేదు. చేలు, పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. వరుణుడు కరుణించక పోతాడాఅని ఆశ మిగిలింది. ఈ ఏడాది రుతుపవనాలు నిర్దిష్ట సమయం కంటే ముందే రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటికీ జిల్లాలో మాత్రం ఆశించిన స్థాయిలో వర్షా లు పడడం లేదు. ఈ నెలలో కూడా రుతుపవనాల్లో ఎలాంటి కదలికలు లేకపోవడంతో చినుకు జాడలేదు. ప్రస్తుతం జూలై మాసం రెండో వారం దాటుతున్నా పగటి ఉష్ణోగ్రత 35.5డిగ్రీలు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు కురవక పోవడంతో భూమిలో తేమశాతం లేక వాతావరణ చల్లబడటం లేదు. నల్లగొండ జిల్లాలోని 33మండలాల్లో పరిశీలిస్తే దేవరకొండ డివిజన్‌లో 135.3మిమీల వర్షపాతం లోటు ఉంది. నల్లగొండ జిల్లాలో 36.2మి.మీల లోటు మిర్యాలగూడ డివిజన్‌లో 51.8మి.మీల వర్షపాతం లోటు, చండూరు డివిజన్‌లో 22.2మి.మీల వర్షపాతం లోటు ఉంది. మొత్తంగా జిల్లావ్యాప్తంగా సగటున వర్షపాతం లోటును పరిశీలిస్తే -33.3శాతం వర్ష పాతం లోటు రికార్డు అయింది. వానాకాలంలో సైతం ఎండకాలం మాదిరిగానే పరిస్థితులు ఉన్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వాతావరణంలో తేమశాతం తక్కువగా ఉన్నట్లు ఉక్కపోత ఉంటుంది. సమృద్ధిగా వర్షాలు పడితే తప్ప వాతావరణంలో మార్పులు కనిపించే అవకాశాలు కానరావడం లేదు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనా ఇప్పటికీ సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. వర్షాల కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. అప్పుడప్పుడు మబ్బులు కనిపించడం తప్ప వర్షాలు మాత్రం కురవ డం లేదు. జిల్లాలో ఏదో ఒక చోట ఎప్పుడో ఒక రోజు కొద్దిసేపు వర్షం పడడం మినహా వ్యవసాయానికి అనుకూలంగా వర్షం పడటం లేదు. మే నెలలో కురిసిన వర్షాలకు విత్తనాలు వేసిన రైతులు అవి మొలకేత్తక పోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. మే నెలలో కురిసిన ఆడదడఫా కురిసిన వర్షాలకు దుక్కులు దున్నుకొని సిద్ధంగా ఉన్నా రైతులకు నైరుతి రుతుపవనాలు ఊరించి ఉసురుమన్పించాయి. అయితే జూన్ మాసంలో వర్షాలు పడక పోవడంతో జూలై మొదటి వారంలో అడపదడఫా కురిసన వర్షాలతో రైతులు పత్తి విత్తనాలు వేశారు. ప్రస్తుతం వర్షాలు కనుమరుగు కావడంతో వేసిన విత్తనాలు మట్టిలోనే మాడిపోయే పరిస్థితి ఉంది. నల్లగొండ జిల్లాలో ఐదు లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు.

పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం

ఈ వానాకాలంలో పత్తి విత్తనాలు సకాలంలో పడకపోవడం ఆ తరువాత ఆలస్యంగా విత్తనాలు వేసినా వర్షాలు కురవకపోవడంతో పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపించనుంది. జిల్లాలో 5లక్షల ఎకరాలకు పైగా పత్తి విత్తనాలు వేశారు. ఈ సీజనలో 5.60 లక్షల ఎకరాలకు జూలై మొదటి వారంలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు కొద్దిగా అంచనాకు అటు ఇటూ వేసినప్పటికీ పత్తి విత్తనాలు వేశారు. విత్తనాలు మొలవక పోవడంతో రైతులు పత్తి విత్తనా లు మూడు సార్లు వేశారు. కూలీల ఖర్చుతో పాటు పత్తి విత్తనాల ఖర్చు కూడా భారీగా కావడంతో రైతు లు ఆర్థికంగా విత్తనాల సమయంలోనే దెబ్బతిన్నారు.

వర్షాలు లేక పత్తిపై ప్రభావం



ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పత్తి పంటపై ప్రభావం చూపిస్తుంది. 5లక్షల ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు వేశారు. వర్షాలు లేక పోవడం వల్ల రైతాంగ ఆందోళనలో ఉంది. పత్తి మొలకలు ఎదుగుదలపై ప్రభావం కనిపిస్తుంది. జూలై మొదటి వారంలో కురిసిన వర్షాలతో రైతులు పెద్ద ఎత్తున ఎరువులను కొనుగోలు చేశారు. వర్షాలు కురిస్తేనే ప్రస్తుతం పత్తి పంట గట్టెక్కే అవకాశాలున్నాయి. బోరుబావుల కింద వరినార్లు పోయడంతో పాటు కొన్నిచోట్ల నాట్లు వేయడం వల్ల వరి సాగు ఇప్పటి వరకు బాగానే ఉంది.

– పి. శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

కొద్దిరోజుల క్రితం కురిసిన కొద్దిపాటి వర్షాలకు రైతులు ఎంతో ఆశగా పెద్దఎత్తున ఎరువులు కొనుగోలు చేసి పైపాటి మందులుగా పత్తి మొలకలు వేశారు. తీరా వర్షాలు లేక మొక్కలు కూడా ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇకపోతే 5లక్షలకు పైగా పత్తివిత్తనాలు వేయగా కనీసం 40శాతం కూడా మొలకెత్తలేదు. ఆలస్యమైనా ఈ నెల 15 వరకు పత్తివిత్తనాలు వేసే అవకాశాలున్నాయి. విత్తనాలు వేసినప్పటికి వర్షాలు లేకపోవడంతో పంటల దిగుబడి గణనీయంగా తగ్గిపోనుంది. మంచి వర్షాలు కురిస్తే వర్షానికి 10 నుంచి 12క్వింటాళ్ల దిగుబడి రానుంది. ఈసారి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించనుంది. బోరుబావుల కింద 2లక్షల ఎకరాలకు సరిపడా వరినార్లు పోశారు. 50వేల ఎకరాలల్లో ఇప్పటికే వరినార్లు కూడా వేశారు.

మబ్బులే ఊరిస్తున్నాయి..



కేతేపల్లి:నిత్యం ఉదయం, సాయంత్రం ఆకాశంలో కారుమబ్బులు కమ్మడం మినహా వరుణుడు కరుణ చూపడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో(జూన్ రెండోవారంలో) అరకొరగా కురిసిన వర్షాలే తప్ప నేటి వరకూ భారీ వర్షం కురవలేదు. అరకొరగా కురిసిన వర్షాలకు మండల రైతాంగం సుమారు 6,300ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఆ తర్వాత 10రోజులుగా వర్షాభావం పరిస్థితులు నెలకొనడంతో కొన్ని విత్తనాలు మొలకెత్తగా మరికొన్ని మొలకెత్తకుండానే పోయాయి. జూన్ నెల చివర్లో వచ్చిన అరకొర వర్షపు జల్లులకు కొందరు రైతులు రెండు, మూడుసార్లు విత్తనాలు పెట్టాల్సి వచ్చింది. ఆ తర్వాత మళ్లీ వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాభావ పరిస్థితిని నల్ల రేగడి భూముల్లోని పత్తి మొలకలు తట్టుకుంటున్నా పెరుగుదల లోపించింది. ఎర్ర నేలల్లో మొలిచిన పత్తి మొక్కలు వేడి గాలులకు వాడిపోతున్నాయి.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవరావు

నల్లగొండ క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి నల్లగొండకు గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టూటౌన్ సీఐ రాఘవరావు కేసు వివరాలు వెల్లడించారు. నల్లగొండ పట్టణానికి చెందిన పెరిక కరుణ జయరాజు, శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన వెల్లెంల శివశంకర్, వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన పెద్దమాము వీరస్వాములు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. కరుణ జయరాజు కొన్నాళ్లుగా రియల్ ఎస్టేట్ చేస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా శివశంకర్, వీరస్వామితో స్నేహం ఏర్పడింది. వీరు రెండేళ్లుగా గంజాయికి అలవాటు పడి హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి కొనుగోలు చేసేవారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఆరు నెలలుగా కరుణజయరాజు పెట్టుబడి పెట్టి శివశంకర్‌ను హైదరాబాద్‌కు పంపేవాడని, అతడు కిలోకు రూ.10 వేలు వెచ్చించి కొనుగోలు చేసుకొని రాగా వీరు ముగ్గురు కలిసి వాటిని చిన్నప్యాకెట్లుగా చేసి వాటిని ఒక్కొక్క ప్యాకెట్‌ను రూ.500లకు విక్రయించేవారు. ఈ నెల 14వ తేదీన సోమవారం ఉదయం వీరు ముగ్గురు కలిసి గంజాయిని చిన్న ప్యాకెట్‌లుగా తయారు చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. వారిని అరెస్టు చేసి గంజాయితో పాటు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.40వేలు విలువైన కిలోన్నర గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో నల్లగొండ టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు ఆధ్వర్యంలో నేరస్తులను పట్టుకున్న టూటౌన్ ఎస్ఐ వై.సైదులు, సిబ్బంది పాయిల్ రాజు, బాలకోటిలను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

మత్తుకు దూరంగా ఉండాలి

నార్కట్‌పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): క్షణకాలం సుఖమనిపించే మత్తు జీవితాలను చిత్తుచేస్తుందని నషా ముక్త్ భారత్ అభియాన్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ మోటివేషనల్ స్పీకర్ గూడూరు అంజిరెడ్డి అన్నారు. మిషన్ పరివర్తన్‌లో భాగంగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం నిర్వహించిన డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్, మత్తు వంటి పదార్థాలకు అలవాటు పడటం ద్వారా జరిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన ఎందరో తమ జీవితాలను నాశనం చేసుకుని తల్లిదండ్రులను మానసికంగా శారీరకంగా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా యువత ఉత్తమ స్నేహితులను, మంచి లక్ష్యాలను ఎంచుకుని క్రమశిక్షణగా జీవితాన్ని కొనసాగిస్తూ ఉత్తమ స్థానానికి చేరుకోవాలని అంజిరెడ్డి సూచించారు. ఈ సదస్సులో హెచ్ఎం శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రకాశ్, కావేరి, అనురాధ, శ్రీదేవి, రాములమ్మ, లక్ష్మారెడ్డి, నుస్రత్, లింగయ్య, లక్ష్మమ్మ, విజయ్‌కుమార్, బాలభాస్కర్ పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమలను తరలించాలి

చిట్యాలరూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రసాయన పరిశ్రమలు వదిలే కాలుష్యంతో ప్రజలు అనారోగ్యంబారిన పడుతున్నారని కాలుష్యకారకమైన రసాయన పరిశ్రమలను తమ ప్రాంతం నుంచి తరలించాలని చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యుడు అనుమోజు రామాచారి కోరారు. రైతులతో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రసాయన పరిశ్రమలు వదిలే కాలుష్యంతో ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో పాటు శరీర అవయవాలు చెడిపోతున్నాయని పేర్కొన్నారు.

చౌటుప్పల్ జాతీయ రహదారిపై లారీ బీభత్సం

● ఆరు కార్లు.. బైక్ ధ్వంసం ● తప్పిన పెను ప్రమాదం ● యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన



ధ్వంసమైన కారు, పూలబడ్డీ వద్ద ఆగిన లారీ

చౌటుప్పల్ రూరల్ జూలై 14: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రం హైదరాబాద్ విజయవాడ జాతీయరహదారిపై సోమవారం ఓ లారీ బీభత్సం సృష్టించింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళుతున్న లారీ బస్టాండ్ సమీపంలోకి రాగానే బ్రేకులు ఫెయిల్ అయి ముందు వెళుతున్న వాహనాలను 50మీటర్ల దూరం ఢీకొట్టుకుంటూ వెళ్లింది. వరుసగా ఆరు కార్లను, రోడ్డుపై నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి డివైడర్‌ను ఢీకొని అక్కడే ఉన్న పూల బండిని ఢీకొట్టి ఆగింది. ఈ సంఘటనలో ఆరు కార్లు, పల్సర్ బైక్ ధ్వంసం అయ్యాయి. కార్లలో ఉన్న పలువురికి స్వల్ప గాయ్యాలయ్యాయి. లారీకి బ్రేక్‌లు ఫెయిల్ కావడంతోనే ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. ధ్వంసమైన కార్లను క్రేన్ సహాయంతో తొలగించారు. వాహనదారుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా లారీ డివైడర్‌ను ఢీకొట్టకుండా ఉంటే పెను ప్రమాదం జరిగేదని సీఐ తెలిపారు. డివైడర్ పక్కనే బస్సుల కోసం 50మందికి పైగా ప్రయాణికులు వేచి ఉన్నారని, లారీ డివైడర్‌ను ఢీకొట్టకుండా నేరుగా వెళితే పెను ప్రమాదం జరిగేదని తెలిపారు. ప్రయాద తీవ్రత ఎక్కువగా ఉన్నా ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

అనుమానాస్పదస్థితిలో బాలుడి మృతి


జీవన్‌కుమార్(ఫైల్)

సూర్యాపేటక్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో బాలుడు చెరువులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలో సోమవారం వెలుగుచూసింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన గొబ్బి జీవన్‌కుమార్(15) పట్టణంలోని ఏపీఎం పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 12న పాఠశాలకు సెలవు కావడంతో ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి కనకలక్ష్మి, బంధువులు చుట్టుపక్కల ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల నివాసాల్లో వెతికారు. అయినా జీవన్‌కుమార్ జాడ తెలియలేదు. ఈ నెల 13న జీవన్‌కుమార్ తల్లి కనకలక్ష్మి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే పట్టణంలోని సద్దులచెరువు మినీట్యాంక్ బండ్ వద్ద వాకింగ్ చేస్తున్న వారికి చెరువులో మృతదేహం కన్పించింది. దీంతో వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చెరువు వద్దకు వచ్చి మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. అనంతరం జీవన్‌కుమార్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. జీవన్‌కుమార్ మృతి చెందడానికి గల కారణాలు తెలియరాలేదని పట్టణ ఎస్ఐ ఏడుకొండల్ తెలిపారు.

సమభావన సంఘంలో అవకతవకలు?

చండూరు రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరు మండలంలోని బంగారిగడ్డ గ్రామానికి చెందిన లక్ష్మి సమభావన సంఘంలో అవకతవకలు జరిగాయని సంఘం సభ్యులు ఆరోపించారు. తమ సంతకాలు ఫోర్జరీ చేసి సుమారు రూ.7లక్షల వరకు స్వాహా చేశారని పేర్కొన్నారు. గత మే నెలలో ఈ సమభావన సంఘానికి రూ.15లక్షల రుణం మంజూరైందని, ఈ విషయాన్ని వీవోఏను ఆ సంఘం సభ్యులు అడగగా కొంత మంది సభ్యులకు రూ.9లక్షలు వచ్చాయని, మరి కొంత మందికి రూ.15లక్షలు వచ్చాయని పొంతనలేని సమాదానం చెప్పారని ఆరోపించారు. ఆ సంఘానికి మంజూరైన రూ.15లక్షలను సంఘంలోని 10మంది సభ్యుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.1.35లక్షలు సభ్యులకు ఇచ్చారని, మిగిలిన రూ.15 వేలు బ్యాంక్ లావాదేవీల్లో కట్‌చేశారని చెప్పారని తెలిపారు. దీంతో అనుమానం వచ్చిన ఆ సంఘం సభ్యులు బ్యాంక్‌కు వెళ్లి విచారించగా, అసలు విషయం బయటకు వచ్చింది. గతంలో తీసుకున్న అప్పు పూర్తిగా తీరలేదని, దానికోసం రూ.15 వేలు సంబంధిత ఖాతాలో ఖాతాలో జమచేశామని సదరు బ్యాంక్ అధికారి చెప్పడంతో సంఘం సభ్యులు ఖంగుతిన్నారు. గతంలో సంఘం సభ్యులు తీసుకున్న మొత్తానికి పూర్తిగా ప్రతి నెలా డబ్బులు కడుతున్నామని, ఎటువంటి బాకీ లేదని ఆ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వీవోఏపై విచారణ చేసి న్యాయం చేయాలని సభ్యులు కోరారు. అదే విధంగా వీవోఏ ఆధీనంలో ఉన్న సుమారు 40 సంఘాల ఖాతాలను, వారి లావాదేవీలను కూడా విచారించి తనపై చర్యలు తీసుకోవాలని కోరారు. బంగారిగడ్డ గ్రామం నుంచి అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి రాలేదని ఏపీఎం పుల్లయ్య తెలిపారు. చెప్పారు. వచ్చిన వెంటనే విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మా కమిటీ ఎన్నికే చెల్లుబాటవుతుంది

చిట్యాలరూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లారీ ఓనర్స్ అసోసియేసన్ సభ్యులు 44మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని, తమ ఎన్నికే చెల్లుబాటవుతుందని లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగిని భిక్షంరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి శివారులోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద సోమవారం మాట్లాడారు. లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో 64మంది సభ్యులున్నారని, కార్యవర్గం సమయం ముగిసినందున నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు సభ్యులంతా కలిసి సర్వసభ్యసమావేశంలో చర్చించామని అంతా కలిసి సమిష్టిగా కార్యవర్గాన్ని ఎన్నుకుందాని తాము కోరగా అందులో 18మంది పక్కకు వెళ్లి ఎన్నికకు సహకరించలేదన్నారు. రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ పెద్దలకు సమాచారమివ్వగా కలిసి ఉండాలని చెప్పారని వారు మాత్రం తమకు సహకరించకుండా కార్యాలయ ఆవరణలో దూరంగా నిల్చున్నార్నారు. తాము 44మంది మెజార్టీ సభ్యులుండగా అందులోని వారిలో గౌరవ అధ్యక్షుడిగా జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, తనను అధ్యక్షుడిగా ప్రధానకార్యదర్శిగా ఆవుల మల్లేష్, కోశాధికారిగా గురిజ జంగయ్యలను ఎన్నుకున్నారన్నారు. వ్యతిరేకించిన వారిని కలిసి ఉందామని మరోమారు పిలిచినా కూడా వారు రాకపోగా 18మందితో కలిసి కార్యవర్గాన్ని ఎన్నుకుని ప్రకటించారన్నారు. ఎక్కడైనా మెజార్టీ సభ్యులున్న వారు ఎన్నుకున్న కార్యవర్గం నిలుస్తుందని అధ్యక్షకార్యదర్శులు, కోశాధికారులుగా సభ్యులే ఎన్నుకుంటారన్నారు. మెజార్టీగా ఉన్న సభ్యులు ఉన్న కార్యవర్గం అసలైనదా 18మందితో కూడా వారి కార్యవర్గం సరైనదా వారేనిర్ణయించుకోవాలని సూచించారు.

బాలల వికాసానికి గేయాలు దోహదం : ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కనగల్, జూలై 14: (ఆంధ్రజ్యోతి) పిల్లల మనో వికాసానికి బాల గేయాలు దోహదం చేస్తాయని టీచర్స్ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన ఊగుతున్న ఉయ్యాల బాల గేయాల పుస్తకాన్ని సోమవారం నల్లగొండ పట్టణంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. సరళమైన భాషలో విద్యార్థులు సులువుగా పాడుకునే విధంగా బాల గేయాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణరావ్, కాలం నారాయణరెడ్డి, మేకల జానారెడ్డి, కళావతి, యూనుస్‌పాషా, సైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మురళి, శ్రీనివాస్, వెంకటరమణ తదితరులున్నారు.

ఎస్ఆర్‌టీఆర్ఐలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ)లో పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, హాస్టల్ వసతితో పాటు ఉద్యోగం కల్పించనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.కిషోర్‌రెడ్డి తెలిపారు. సంస్థలోని ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కార్యక్రమాలకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన సోమవారం తెలిపారు. రెండు నెలల కాలపరిమితి గల బేసిక్ కంప్యూటర్స్ కోర్సుకు ఇంటర్మీడియేట్ పాస్, మూడున్నర నెలల కాలపరిమితి గల ఆటోమొబైల్ -2 వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదవ తరగతి పాస్, మూడున్నర నెలల కాలపరిమితి గల సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్ మరియు సర్వీస్ కోర్సుకు పదవ తరగతి పాస్ లేదా ఐటీఐ ఉన్న వారికి ప్రాధాన్యం కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 18-30 సంవత్సరాల మధ్య వయస్సు గలవారై ఉండాలన్నారు. గ్రామీణ అభ్యర్థులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చదువు మధ్యలో ఉన్నవారు అర్హులు కారు అని తెలిపారు. అర్హతల ఒరిజినల్ సర్టిఫికేట్లు, జిరాక్స్ సెట్, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డుతో దరఖాస్తులు కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222 లేదా 9948466111 ఫోన్‌లో సంప్రదించాలని సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్ కిషోర్‌రెడ్డి కోరారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు

నల్లగొండ కల్చరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోమలి కళా సమితి నల్లగొండ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు నల్లగొండ పట్టణంలో సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని చిన్న వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మూడు రోజుల పాటు నాటికలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బక్క పిచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీన సాయంత్రం 7గంటలకు నాటకోత్సవాలను ముఖ్యఅతిథులచేత ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. 7.15నిమిషాలకు స్వప్నం రావాల్సిన అమృతం నాటిక, రాత్రి 8.30 నిమిషాలకు ఈ మంచం నాది కాదు, 16వ తేదీన అమ్మ చెక్కిన బొమ్మ, రాత్రి ఇది రహదారి కాదు, 17వ తేదీన స్వేచ్ఛ, రాత్రి సంధ్యా వెలుగు నాటికలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ నాటికలకు సంబంధించిన కళాకారులు నల్లగొండకు చేరుకున్నారని కళావేదికను సిద్ధం చేశామని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి, నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు రామచందర్‌రావు, శ్యాంప్రసాద్ హాజరవుతున్నారని తెలిపారు.

నేడు బుద్ధునితో నా ప్రయాణం నాటకం

బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 15వ తేదీన సాయంత్రం 6.30 అలకాపురి కాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుద్ధుడితో నా ప్రయాణం నాటకం ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు సంకు హరి, మండల అంజనేయులు, నామ వెంకటేశ్వర్లు, సంకు లింగయ్య, నూనె విష్ణు, కొత్త నరేష్, జిలుగు రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సందేశాత్మకమైన నాటకం ప్రదర్శిస్తున్నందున పట్టణ ప్రజలు ఈ నాటకాన్ని తిలకించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ హౌస్‌అరెస్ట్



మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

మోత్కూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరిలో సోమవారం సీఎం సభ జరుగుతున్న నేపథ్యంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను హైదరాబాదులోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ ఇటీవల తిరుమలగిరిలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాలువలకు నీరు విడుదల చేసిన తర్వాతే సీఎం తిరుమలగిరికి రావాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చకుండా ఆయనకు తుంగతుర్తికి వచ్చే అర్హత లేదని విమర్శించారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు సభకు ఆటంకం కల్గించకుండా ఉండేందుకుగాను పోలీసులు ముందస్తు చర్యగా హైద్రాబాదులో ఆయన్ను (మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌ను) సోమవారం తెల్లవారుజాము నుంచి హౌజ్ అరెస్టు చేశారు. ఆయన ఆఫీసు గదిలో, ఇంటి ముందు పోలీసులు మోహరించి ఆయన్ను బయటకు వెళ్లనివ్వలేదు.

ఎన్ని నిధులైనా ఇస్తా..తుంగతుర్తిని అభివృద్ధి చేస్తా

(5వ పేజీ తరువాయి)

జలాలు తెస్తామంటున్న వారు పదేళ్ల ఏంచేశారని పదేళ్ల ఏం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం కూలేశ్వరం అయ్యిందన్నారు. తన ఊరికి మండలం చేసుకు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించుకోలేని వ్యక్తి కూడా మాట్లాడితే ఎలా ఎద్దేవా చేశారు. ఉమ్మడి జిల్లాలో ఒక్కడు గెలిచాడని, రానున్న ఎన్నికల్లో ఆయన్ను కూడా ఓడించాలని పిలుపునిచ్చారు. ఆయన సంగతి చూడటానికి మా దామన్న (మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి) ఒక్కరు చాలన్నారు. నిరుద్యోగులకు 18 మాసాల్లోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని, మిగిలిన మూడున్నర ఏళ్లలో లక్ష ఉద్యోగాలు ఇచ్చి తీరుతామన్నారు.

50 వేల మెజార్టీ ఇచ్చారు?

ఎన్నికల్లో రూ.50 వేలతో పోటీ చేసిన సామేలును అభిమానంతో 51 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో రకరకాల వారుంటారని, ఈ ప్రాంతం వారు ఆవేశాన్ని దాచుకోలేరంటూ అందరినీ కలుపుకపోవాలని ఎమ్మెల్యే సామేలుకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్ములను గెలిపించే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు వస్తే మూడింటిని నల్లగొండ జిల్లా వారికే ఇచ్చామని, రాష్ట్రంలో నల్లగొండకు ప్రత్యేక స్థానముందన్నారు. ఏ పార్టీ అయినా అధికారంలోకి వస్తే రెండు టర్మ్‌లు అధికారంలో ఉండటం రాష్ట్రం ఆనవాయితీ అని కాంగ్రెస్ రెండు టర్మ్‌లు అధికారంలో ఉంటుందన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



మంత్రులతో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు ముచ్చట్లు

తొలుత సభావేదిక వద్ద ఏర్పాటుచేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. నాగారంలో రూ.3.75 కోట్లతో తహసీల్దార్ భవనం, రూ.3.50 కోట్లతో పోలీస్‌స్టేషన్, రూ.4కోట్లతో మండల ప్రజా పరిషత్ భవనాలకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి రూ.11.70 లక్షలతో చేపట్టే 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం నిర్మాణ పనులకు, అడ్డగూడూరులో రూ.3.75 కోట్లతో తహసీల్దార్ కార్యాలయ భవనం, రూ.4 కోట్లతో మండ ప్రజా పరిషత్ కార్యాలయ భవనం, రూ.3.50 కోట్లతో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ,



లబ్ధిదారురాలికి రేషన్‌కార్డు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

తిరుమలగిరిలో రూ.5.30 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవననిర్మాణాల శిలాఫలకాలను ఆయన ప్రారంభించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అధ్యక్షతన సభ జరిగింది.

పెద్దఎత్తున జనసమీకరణ

తిరుమలగిరి సభకు పెద్దఎత్తున జనసమీకరణ జరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చారు. సభలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, బీ.లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, నల్లగొండ, భువనగిరి ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ చైర్మన్ బస్వరాజు సారయ్య, రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం మన అభ్యర్థులనే గెలిపించుకోవాలి: మంత్రి కోమటిరెడ్డి



మోత్కూర్/తిరుమలగిరి14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కంచుకోట అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం మన అభ్యర్థులనే గెలిపించుకోవాలన్నారు. మోత్కూరు బిక్కేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. గతంలో పేదలకు ఇళ్లు, ఉచిత కరెంటు ఇవ్వలేదన్నారు. తమ ప్రజా ప్రభుత్వం వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఉచిత కరెంటు అందిస్తున్నామన్నారు. పదేళ్లు కాంగ్రెస్సే రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్నారు. మట్టి రోడ్లన్నీ బీటీ చేయిస్తామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పేదల ప్రభుత్వం: ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్



కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. అప్పుల పాలు చేసిన రాష్ట్రాన్ని గాడిన పెట్టి పేద ప్రజల కడుపు నింపడానికి కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు.

పదేళ్లు మాట్లాడనోళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారు: ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మాట్లాడని ఆ పార్టీ సన్నాసులు ఇప్పుడు మాట్లాడుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయని ఆలోచనలు సీఎం రేవంత్‌రెడ్డి చేసి పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, కొత్త రేషన్‌కార్డులు అందిస్తున్నారన్నారు. తుంగతుర్తి గడ్డ కాంగ్రెస్ అడ్డ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో ఒక్కసారైన సీఎం అధికారికంగా వచ్చారా అని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ప్రజా పాలనలో భాగస్వాములను చేయాలన్నారు. మెట్టినింట (హుజూర్‌నగర్) సన్నబియ్యం, పుట్టినింట (తిరుమలగిరి) కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయించిన ఘనత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

నియోజవర్గానికి దేవాదుల నీరు అందించాలి: ఎమ్మెల్యే సామేలు



సభకు అధ్యక్షత వహించిన తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ తుంగతుర్తి నియోజక వర్గాని దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందించాలని కోరారు. తుంగతుర్తి పోరాటాల గడ్డ అన్నారు. రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై సవాల్ చేసి గెలిచి వచ్చి సీఎం అయ్యారని కొనియాడారు. తుంగతుర్తి నియోజక వర్గం అభివృద్ధికి చేయాల్సిన పనులను సీఎం అందజేస్తానన్నారు.

ప్రజా ప్రభుత్వం పేదల గుండెల్లో నిలిచింది: మంత్రి అడ్లూరి లక్ష్మణ్



బీసీలకు 42శాతం రిజర్వేషన కల్పించడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, ప్రజా ప్రభుత్వం ప్రజల గుండెల్లో నిలుస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఏ సంక్షేమ పథకంలో లబ్ధిపొందాలన్నా దానికి రేషన్ కార్డే ప్రామాణికం అయినందున ఇంత కాలం కొత్త రేషన్ కార్డులు ఇవ్వక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడా ఇబ్బందులన్నీ తొలగిపోతాయన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆడ్లూరి లక్ష్మణ్, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, కుంబం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, యశస్వినిరెడ్డి, బి.లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, నల్లగొండ, భువనగిరి ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం, రేషన్‌కార్డులు చరిత్రాత్మక పథకాలు

(5వ పేజీ తరువాయి)

విక్రయించుకున్నారన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రజాప్రభుత్వం ఆలోచించి ఉపముఖ్యమంత్రి, మంత్రివర్గం ఆమోదంతో పేదల కడుపు నిండా అన్నం పెట్టాలనే సంకల్పంతో సన్నబియ్యం పథకం ప్రారంభించామన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో 80శాతం జనాభా 3.10కోట్ల మంది నాణ్యమైన సన్నబియ్యంతో కడుపునిండా అన్నం తింటున్నారన్నారు. ఉప ఎన్నికలు వచ్చి న చోట తప్పితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ప్రజాప్రభుత్వంలో 5లక్షల నూతన రేషన్‌కార్డులు ఇస్తున్నామన్నారు. పాత కార్డుల్లో నూతనం గా సభ్యులను చేర్చామన్నారు. దేవాదుల ద్వారా తుంగతుర్తి, పాలకుర్తి నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించాలని, ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు, కేతిరెడ్డి ఫీడర్ ఛానల్ పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గతంలో ఈ ప్రాంతంలో ప్రాతినిధ్యం వహించిన నాయకులు కాళేశ్వరం గురించి మాట్లాడుతున్నారని, ఆ ప్రాజెక్ట్ కట్టింది వాళ్ల హయాంలోనే, కూలింది వాళ్ల హయాంలోనని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నిరుపయోగంగా ఉన్నా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 281లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారన్నారు. బునాదిగాని కాల్వకు రూ.200కోట్లు మంజూరు చేశామని, భూసేకరణకు ఎమ్మెల్యేలు సహకరించాలన్నారు. నియోజకవర్గంలో చెరువుల మరమ్మతులు చేయిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

సీఎం సభ సైడ్ లైట్స్

(ఆంధ్రజ్యోతి- మోత్కూరు)

- సీఎం రేవంత్‌రెడ్డి 20 నిముషాలు ఆలస్యంగా వచ్చారు. 4.20 గంటలకు హెలిప్యాడ్ వద్ద హెలిక్యాప్టర్ దిగారు.
- 4.25గంటలకు సభా వేదకి సమీపంలో ఏర్పాటు చేసిన వివిధ అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు.
- 4.29 గంటలకు సభా వేదికపైకి చేరుకుని ఈ చివరి నుంచి ఆ చివరి వరకు ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్లారు.
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళుతున్న సందర్భంగా అక్కడే నిల్చున్న తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు బుజం తట్టగా ఆయనకూడా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ప్రజలకు అభివాదం చేస్తూ నడిచారు.
- 4.32 గంటలకు అందరూ లేచి నిలబడి జయజయహే తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించారు.
- సీఎం రేవంత్‌రెడ్డి 31నిముషాలు ప్రసంగించారు. 5.21గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి, 5.52 గంటలకు ముగించారు.
- ప్రసంగం ముగిసిన వెంటనే కొత్తరేషన్ కార్డుల పంపిణీ లాంఛనంగా ప్రారంభించారు.
- సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే మందుల సామేలు మెమెంటోను అందించారు. సభలో పాల్గొన్న మంత్రులు, శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరిని శాలువలతో సన్మానించారు.
- సభకు మహిళలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు.
- సభికులకు మంచినీటి ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు.
- తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన కొన్ని ఫ్లెక్సీలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- భర్తను హత్య చేయించి... రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- తమ్ముడు, మరొకరితో కలిసి ఘాతుకం
- కారు అద్దెకు తెచ్చిన భార్య సన్నిహితుడు
- యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరులో ఘటన



స్వామి(ఫైల్ ఫొటో)

మోటకొండూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న కోపంతో తమ్ముడు, తన సన్నిహితుడితో కలిసి భర్తను ఓ భార్య హత్య చేయించింది. ఆదివారం అర్ధరాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ నాగుల ఉపేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వస్పుల స్వామి(38)కి మోత్కూరు మండలం దాచారం గ్రామానికి చెందిన స్వాతితో వివాహంకాగా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. స్వామి భువనగిరి పట్టణంలోని ఓ ట్రాక్టర్ షోరూంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు వీరబాబుతో కలిసి భువనగిరిలో పనులు ముగించుకుని ఆదివారం అర్ధరాత్రి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రాయగిరి-మోత్కూరు ప్రధాన రహదారి కాటేపల్లిలోని బ్రిడ్జి దాటగానే వెనుకనుంచి వేగంగా వచ్చిన ఓ కారు ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టి 50మీటర్ల దూరం ఈడ్చుకువెళ్లింది. దీంతో వస్పుల స్వామి అక్కడికక్కడే మృతిచెందగా, వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచరమివ్వగా, మెరుగైన చికిత్స నిమిత్తం వీరబాబును హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబసభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి హత్యోదంతం

ఈ ప్రమాదంపై తమకు అనుమానం ఉందని, స్వామిని భార్య తరుపువారే హత్య చేసి ఉంటారని స్వామి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు స్వామి భార్య స్వాతి, బావమరిది మహేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం బయటపడింది. మహేష్ భార్యతో స్వామికి వివాహేతర సంబంధం ఉండటంతో ఇరు కుటుంబాల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. దీంతో భర్త స్వామిని అడ్డు తొలగించుకునేందుకు తమ్ముడు మహేష్, తనతో సన్నిహితంగా ఉండే యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం పల్లెపహాడ్‌కు చెందిన సాయికుమార్‌తో కలిసి ప్రణాళిక రూపొందించింది. సాయికుమార్ ఓ కారు అద్దెకు తీసుకువచ్చి స్నేహితుడి కలిసి కారు నడుపుకుంటూ స్వామి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. అనంతరం అక్కడే ఉన్న మామిడి తోటలో కారును వదిలేసి పరారయ్యారు. పథకం ప్రకారం సాయికుమార్ అతని స్నేహితుడితో కారులో వచ్చి స్వామి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి హత్యకు పాల్పడ్డారని, రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని చిత్రీకరించడానికి ప్రయత్నించారని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వామి బాబాయి అయిలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనలో స్వాతి (ఏ1), మహేష్ (ఏ2)లను పోలీసులు అదుపులోకి తీసుకోగా, వాహనం నడిపిన, వాహనంలో ఉన్న మరొకరిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంది.

సొంతూరిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం



రామచంద్రరావును గజమాలతో సత్కరిస్తున్న నల్లబండగూడెం గ్రామస్థులు

కోదాడ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎన్.రామచంద్రరావు స్వగ్రామం మండలంలోని నల్లబండగూడెం గ్రామానికి సోమవారం రాత్రి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బాణసంచా కాల్చుతూ, పూలు చల్లుతూ ఊరేగింపు నిర్వహించారు. నల్లబండగూడెం బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు సుమారు రెండు కిలో మీటర్లకు పైగా సాగింది. ఆయనకు గ్రామస్థులు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు రాంచంద్రరావుకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. చిన్నతనంలోనే గ్రామం విడిచి వెళ్లిన రాంచంద్రరావు తమ గ్రామానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. రామచంద్రరావు గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో కూడా నల్లబండగూడెంకు వచ్చినప్పుడు గ్రామస్థులు ఆయనను పూలమాలలతో సన్మానించారు. రాంచంద్రరావు మొదట గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలోని మాలగూడెంలోని సుందర్‌రావు వీధిలో సహపంక్తి భోజనం చేశారు. గ్రామంలోనే ఆయన బస చేస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. రాంచంద్రరావుకు స్వాగతం పలికిన వారిలో మాజీ సర్పంచ్ సుశీల బెంజిమెన్, ముంద్రా రంగారావు, నల్లపాటి నర్సింహారావు, మేకల ప్రతాప్, అల్సకాని శరబేశ్వరరావు, న్యాయవాదులు రాధాకృష్ణ, మేకల వెంకట్రావు, విజయ్‌కుమార్, పలువురు గ్రామస్థులు ఉన్నారు.

సీఎం సభతో ప్రయాణికుల ఇక్కట్లు



బస్సులు లేక ఖాళీగా ఉన్న సూర్యాపేట బస్‌స్టేషన్

సూర్యాపేటఅర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ లో బస్సులు లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం తిర్మలగిరిలో జరిగే తెల్లరేషన్‌కార్డుల పంపిణీ సీఎం రేవంత్‌రెడ్డి సభకు సూర్యాపేట డిపో నుంచి బస్సులు వెళ్లడంతో ప్రయాణికులు కొంత మేరకు ఇక్కట్లకు గురయ్యారు. వివిధ గ్రామాల నుంచి పట్టణానికి వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణ సమయంలో బస్సులు లేక ఆటోలకు అధిక చార్జీలతో తమ గ్రామాలకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా ఫ్రీ టికెట్ కావడంతో మహిళలు నిత్యావసర వస్తువులు కొనాలన్నా పట్టణ ప్రాంతాలకు వస్తూ తమకు కావాల్సిన కొనుక్కుని వెళుతుంటారు.

సీఎం సభకు 40 బస్సులు వేశాం: సూర్యాపేట డిపోనుంచి తిర్మలగిరిలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డుల పంపిణీ సభకు 40బస్సులు కేటాయించాం. 20 బస్సులు ఎక్స్‌ప్రెస్, 20 పల్లె వెలుగు బస్సులు కేటాయించాం. ప్రజలు ఇబ్బందులు పడక

-లక్ష్మీనారాయణ, ఆర్టీసీ సూర్యాపేట డిపో మేనేజర్

గుట్టలో శివకేశవులకు విశేష పూజలు



గుటలో స్పటిక లింగానికి హారతి నివేదిస్తున్న ప్రధానార్చకుడు నరసింహమూర్తి

యాదగిరిగుట్ట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి, అమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్పటిక మూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 24,47,474 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. లక్ష్మీనృసింహుడిని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ కుటుంబ సమేతంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రోటోకాల్, ప్రజా సంబంధాల సలహాదారుడు అర్కాల వేణుగోపాలరావు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా.. వేద మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. డీఈవో దోర్బల భాస్కరశర్మ లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటాలు అందజేశారు. ఈ నెల 15వ తేదీన హుండీ కానుకల లెక్కింపును వచ్చే వారానికి వాయిదా వేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.

సంప్రదాయబద్ధంగా శ్రీలక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్య కల్యాణాన్ని వేదపండితులు సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడిని నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం భక్తిశ్రద్ధలతో హోమాలు చేశారు. కల్యాణం అనంతరం అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.



ప్రజా సంబంధాల సలహాదారుడు వేణుగోపాలరావుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న డీఈవో భాస్కరశర్మ

మిత్రుడికి ఆర్థిక సహాయం అందజేత

శాలిగౌరారం, జూలై 14(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలోని ఉప్పలంచ గ్రామానికి చెందిన మందుల పరుశరాములు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతనితో చదువుకున్న విద్యార్థులు సోమవారం ఉప్పలంచ గ్రామంలో పరుశురాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తోట శ్రవణ్ కుమార్, మందుల బాలకృష్ణ, పరశురాం, రాము, నాగార్జున, శ్రీను పాల్గొన్నారు

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.20 లక్షలు మంజూరు చేయాలి

నల్లగొండ, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పానగల్లులో ఉన్న 19వ వార్డులో శ్రీనగర్ కాలనీ, దీపక్‌నగర్, ఆదర్శకాలనీ, ఎన్‌జీవోస్ కాలనీలో దొంగల బెడదను అరికట్టడానికి సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ.20లక్షలు మంజూరు చేయాలని మాజీ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఆయా కాలనీలకు బైపాస్ రోడ్డుతో పాటు రైల్వేస్టేషన్‌కు దగ్గరగా ఉండటంతో దొంగల బెడద తీవ్రంగా ఉందని అన్నారు. పోలీస్ పెట్రోలింగ్ కూడా పెంచాలని కోరారు.

సమస్యలు పరిష్కరించే వారేరీ?

● 'ప్రజావాణి'కి వినతుల వెల్లువ



బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 14(ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చిన పూజా రి కరుణించలేదు అన్న చందంగా మారింది జిల్లా అధికారుల పరిస్థితి. సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులు, కోర్టులను ఆశ్రయించినా వాళ్ల ఆదేశాలను అమలు చేయడంలో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కోర్టులు, ఉన్నతాధికారుల ఆదేశాలను తీసుకొని బాధితులు వారంవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతున్నారు. అయినా వారికి అక్కడ సరైన న్యాయం జరగడం లేదు. దీంతో ఎన్నో వ్యయ ప్రయాసాలు కోర్చి తిరుగుతున్న వారు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇంకా ఎంతకా లం తాము అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాలని ప్రశ్నిస్తున్నారు. దేశం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆర్మీలో విధులు నిర్వర్తించిన తనకే తన భూమిని కాపాడటంలో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఓ రిటైర్డ్ ఆర్మీ మేజర్ ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అనేక మంది బాధితులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్ట ర్ జె.శ్రీనివాస్‌తో కలిసి బాధితుల నుంచి వినతిని స్వీకరించి వాటిలో సాధ్యమైనంత మేరకు కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.

పింఛన్ ఇప్పించండి



నేను నిరుపేద కుటుంబానికి చెందిన వాడను. నాకు నా అంటూ ఎవరూ లేరు. కొన్నేళ్ల కిత్రం కళ్లు పోవడంతో కొంత కాలం కిత్రం ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ మంజూరు చేసింది. దాంతో జీవనం కొనసాగించేవాడిని. ఐదు నెలలుగా పింఛన్ నిలిపివేశారు. అదేమిటని ప్రశ్నిస్తే ఆసుపత్రికి వెళ్లమన్నారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత అక్కడ ఉన్న మేడం నీకు 65 ఏళ్లు దాటాయి. నీకు వృద్ధాప్య పింఛన్ తీసుకో అంటూ 35శాతం వైకల్యం వేశారు. అప్పటి నుంచి పింఛన్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. అధికారులు ప్రజాప్రతినిధులను ఎన్నిసార్లు కలిసి వేడుకున్నా ఫలితం లేకుండా పోతుంది. నాకు జీవనాధారమైన దివ్యాంగుల పింఛన్ వచ్చేలా తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయండి.

\- ఎర్ర యాదయ్య , కల్లెపల్లి, మునుగోడు

నా భూమి నాకు ఇప్పించండి



దేశం కోసం పనిచేసిన తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమి విషయం దేవుడెరుగు తమ పూర్వీకుల నుంచి వస్తున్న భూమిని అన్యాక్రాంతం కాకుండా చూడటంలో అధికారులు విఫలమయ్యారు. తనకు తమ గ్రామం లో సుమారు 40 ఎకరాలు వంశపారపర్యంగా వస్తుంది. అయితే ఆ భూమిలో కొంత భూమి ఆక్రమణకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అత్యున్నత న్యాయస్థానం నిర్దేశానుసారం సీపీసీ 145, 146, 147 ప్రకారం ఆక్రమణకలు గురవుతున్న భూములపై ఉన్నతాధికారులైన జిల్లా మెజిస్ట్రేట్, సబ్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, ఎస్పీలను ఆశ్రయించాం. అయినా ఎలాంటి స్పందన లేదు. ఇదే క్రమంలో ఆర్డీవోను, ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్‌ను కలిసినా ఎలాంటి ఫలితం లేదు. అంతేకాక పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. దీనిపై కింది నుంచి పైస్థాయి కోర్టులను ఆశ్రయించగా కోర్టు తీర్పులు సైతం తమకు అనుకూలంగా వచ్చాయి. కోర్టు ఆదేశానుసారం అధికారులు నడుచుకోవాల్సి ఉన్నా క్షేత్రస్థాయి అధికారులు కోర్టు ఉత్తర్వులను బేఖాతర్ చేస్తున్నారు. దయచేసి ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపించి తన తండ్రి పేరిట ఉన్న భూములను తన పేరిట ఫౌతీ చేయాలి.

\- మాలె సతీష్, రిటైర్డ్ మేజర్

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి



నేను కలెక్టరేట్ సమీపంలోని సర్వే నెంబర్ 256లో 4 గుంటల భూమిని 2023లో కొనుగోలు చేసి పట్టా చేయించుకున్నాను. దీనికి సంబంధించి పాస్ పుస్తకం రావడమే కాకుండా రైతుబంధు డబ్బులు కూడా తమ ఖాతాలో పడ్డాయి. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అదే ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని స్వాతంత్ర్య సమరయోధుల ద్వారా కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే వారు తాము ఆక్రమించుకున్న భూమిలో కాకుండా తమ భూమిలో హద్దు రాళ్లు వేసుకున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవోలకు విన్నవించినట్లు తెలిపారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ ఎందుకు రద్దు చేయడం లేదని రెవెన్యూ అధికారిని ప్రశ్నిస్తే తనపై పోలీసు కేసు పెడతానని బెదిరిస్తున్నారు. తన భూమిని ఆక్రమించుకున్న వారిపై తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలి.

\- బత్తుల కౌసల్య, సూర్యాపేట

పంచాయతీకి రూ.12.75 లక్షల ఆదాయం



దుకాణాలకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, జూ లై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు గ్రామ పంచాయతీకి చెం దిన వాణిజ్య సముదాయం అద్దె షాపులకు బహిరంగ వే లం నిర్వహించగా రూ.12.75లక్షలు పలికాయి. గ్రామ పంచాయతీకి చెందిన వాణిజ్య సముదాయం భవనంలో గల మొత్తం 8 దుకాణాలను ఏడాది కాలపరిమితికి గాను అద్దె ఇవ్వడం కోసం సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంపాట ద్వారా గ్రామ పంచాయతీ షాపులకు ఏడాది కాలపరిమితి అద్దె కింద రూ.12.75లక్షల ఆదాయం సమకూరింది. నల్లగొండ డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కత్తులోజు ఉమేష్‌చారి, ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, గీతాంజలి, మాజీ సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, రేగట్టె నర్సింహారెడ్డి, వారాల రమేష్, రేగట్టె నవీన్‌రెడ్డి, మల్ల శంకర్, గడుసు శశిధర్‌రెడ్డి, గ్రామస్థులు, వేలందారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద పేదలకు వైద్య ఖర్చుల కోసం అందించే నిధులను సద్వినియోగం చేసుకోవాలని చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది పేద ప్రజలకు రూ.8లక్షలు వైద్య ఖర్చుల కింద ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కార్యదర్శి బూడిద లింగయ్యయాదవ్, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, నాయకులు భీమనపల్లి సైదులు, ఆరెళ్ల సైదులు, అప్పారావు, కృష్ణ, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కప్పకాముడు



చిట్యాలలో కప్పకాముడు ఆడుతున్న మహిళలు

చిట్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని వరుణదేవుడిని ప్రా ర్థిస్తూ మహిళలు సోమవారం చిట్యాలలో కప్పకాముడు ఆడారు. కాడికి వ స్త్రంతో కప్పను కట్టి దానిని తడుపుతూ ఇంటింటికి పాటలు పాడుతూ తిరిగారు. కార్యక్రమంలో గ్రామస్థులు కొలనుచెలిమి బాలమ్మ, మేకల రమణమ్మ, అమరోజు అండాలు, షైల సుజాత, కంబంపాటి పద్మ, వేముల కోటమ్మ, ఏళ్ల యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సత్యనరేష్

చిట్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి స త్యనరేష్ కోరారు. చిట్యాల పట్టణంలోని సోమవారం నిర్వహించిన సమన్వ య కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. టీబీ లక్షణాలు ఉన్నాయని అనుమానం వస్తే వెంటనే ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. వారు వెంటనే కళ్లె పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, ఏసీడీపీవో దీప వెంకటమ్మ, ఎంఈవో సైదానాయక్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రావణ్‌కుమార్, ఏపీఎం శ్రీలత, టీఎంసీ సరిత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలి

నల్లగొండరూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): దేవరకొండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనలో బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలోని ముదిగొండ గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ బాలిక పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలో సుమారు 15 మంది గిరిజన విద్యార్థినులు అనారోగ్యానికి గు రైయ్యారని తెలిపారు. ఈ ఘటనపై వెంటనే పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కలెక్టర్ తక్షణమే స్పందించి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, అన్ని వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల పింఛన్ హామీని నెరవేర్చాలి

మర్రిగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల ముందు దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ పెంపును హామీని వెంటనే నెరవేర్చాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. దివ్యాంగుల జిల్లా కమిటీ పిలుపుమేరకు సోమవారం మర్రిగూడ మండలంలోని దివ్యాంగులు నల్లగొండ జిల్లాలో నిర్వహించే మహాగర్జన సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షులు రాములు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్‌ను పెంచి హామీని నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

గట్టుప్పల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీవో లావణ్య హెచ్చరించారు. మండలంలోని తేరట్‌పల్లి మొదటి అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. టీచర్, ఆయా పిల్లల పట్ల వ్యవహరిస్తున్న తీరును తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు లోపాలు కనిపించడంతో టీచర్ ఉషారాణి, ఆయాకు మెమో జారీ చేస్తున్నట్లు సీడీపీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ యాదమ్మ, గ్రామస్థులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

గౌడ సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్

శాలిగౌరారం, జూలై 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ నేపథ్యంలో చేపట్టనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటారనే సమాచారంతో ముందుస్తుగా గౌడ సంఘం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. గీతకార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియోలు విడుదల చేయాలని, అదే విధంగా కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గౌడ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రేవంత్‌రెడ్డి సభలో నిరసన తెలపడానికి వెళ్లనున్నట్లు తెలుసుకున్న పోలీసులు శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన సర్వాయి పాపన్న సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సింహగౌడ్, గౌడ యువజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మల సురేష్‌గౌడ్‌లను శాలిగౌరారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూజీకత్తుపై విడుదల చేశారు.

సమాచారం

బీజేపీలో చేరిక

నార్కట్‌పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లికి చెందిన కొంతమంది యువకులు సోమవారం బీజేపీలో చేరారు. బండారు రవి, నవీన్, శ్రీకాంత్‌తో పాటు మరికొంత మంది యువకులు పార్టీలో చేరగా వారికి పార్టీ రాష్ట్ర నాయకుడు పజ్జూరి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్‌లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్వాయి భాస్కర్ రావు, కొర్వి శంకర్, మునుకుంట్ల గణేష్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, పార్థసారధి, బిల్లకంటి శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

శాలిగౌరారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన బండారు ధనుంజయ్, గుడిపాటి పరమేష్‌లు మరి కొంతమంది ఎంపీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ లో చేరిన వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడానికి నాయకులు పని చేయాలని కోరారు. పార్టీలో పని చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

ఎంపీవోగా బాధ్యతల స్వీకరణ

కట్టంగూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎంపీవోగా కె.స్వరూపారాణి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె మునుగోడు నుంచి కట్టంగూరు మండలానికి బదిలీపై వచ్చారు. స్వరూపారాణిని ఎంపీడీవో పి.జ్ఞానప్రకాశ్‌రావు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి, సీనియర్ అసిస్టెంట్ మద్ది సులోచన, మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షురాలు జయసుధ, వడ్లకొండ అశోక్ ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

నార్కట్‌పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం ఎంపీపీఎస్, జడ్పీ హైస్కూల్ పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయురాలు కంచర్ల వినోద ఆర్థిక సహకారంతో సుమారు రూ.20వేల విలువైన టై బెల్టులు, బ్యాడ్జీలు, షూలను అందజేశారు. ఈ ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత, నాణ్యమైన విద్య లభిస్తుందని, అర్హత గల ఉపాధ్యాయులతో బోధన అందుతుందున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లేపల్లి కాశయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వంగాల పల్లవి, వస్తుప్పల చంద్రయ్య, ఉపాధ్యాయులు ఆర్.సత్యనారాయణ, హెప్సిబా, భాస్కర్, పద్మావతి, ఆదిమళ్ల మణిరాజు, ఎండీ.ఆరిఫ్ పాల్గొన్నారు.

గట్టుప్పల్: ప్రాథమికోన్నత పాఠశాల పులిపలుపుల పూర్వ విద్యార్థి బీరెల్లిగూడెం గ్రామ వాస్తవ్యులు యంపల్ల స్వామి పాఠశాలలోని 130మంది విద్యార్థులకు సోమవారం రూ.50వేలు విలువ చేసే ఐడెంటిటీ కార్డులు, టై, బెల్ట్, షూస్‌లు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, ప్రధానోపాధ్యాయులు డి.కళావతి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సయ్యద్ యూసుఫ్ పాషా పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ



నల్లగొండ పట్టణంలోని డీఈవో కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన

నల్లగొండరూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయిల్, అమెరికా దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని బండ్లగూడలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుల దాడిని ఖండిస్తూ ఖండిస్తూ సోమవారం పట్టణంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజాస్వామికంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడులు చేయడం సమంజసం కాదని అన్నారు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నిస్తున్న వారిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. దాడి చేసినంత మాత్రాన ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు. దాడులకు పాల్పడిన బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు, పట్టణ కార్యదర్శి గాదేపాక సూర్యతేజ, నాయకులు రమేష్, సంతోష్, రమేష్, సాయిచరణ్, చరణ్, తరుణ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

● మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పోలు వెంకట్‌రెడ్డి



మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న పోలు వెంకట్‌రెడ్డి

చండూరురూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు నిర్వహించన్నుట్లు చండూరు మార్కెట్ కమి టీ వైస్‌చైర్మన్ పోలు వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉడుతలపల్లి గ్రా మంలో గల ఊరచెరువు అలుగు మరమ్మతు పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.7.50లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో చండూరు మండలాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, మాజీ అధ్యక్షుడు పల్లె వెంకన్న, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు సాగర్‌రెడ్డి, మాజీ సర్పంచులు సాపిడి రాములు, మేకల వెంకన్న, నాయకులు ఇరిగి రాజు, గంట తులసయ్య, సిలుముల రమేష్, శంకర్, జానయ్య, ఇరిగేషన్ డీఈఈ ఖాసీం, ఏఈ రఘు, పంచాయతీ కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గోప జిల్లా సంయుక్త కార్యదర్శిగా ముత్యంరాజుగౌడ్

శాలిగౌరారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గౌడ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోప) నల్లగొండ జిల్లా సంయుక్త కార్యదర్శిగా మండలంలోని ఊ ట్కూరు గ్రామానికి చెందిన జర్నలిస్ట్ రంగు ముత్యంరాజుగౌడ్ ఎన్నికైయ్యారు. జిల్లా కేంద్రంలోని గౌడ విద్యార్థి హాస్టల్‌లో గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన రంగు ముత్యంరా జుగౌడ్ జైగౌడ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శిగా, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. పలు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా ముత్యంరాజుగౌడ్ మాట్లాడుతూ ధర్మభిక్షం, సర్దార్ సర్వాయి పాపన్నల స్ఫూర్తితో గౌడ జాతి ఐక్యత కోసం పనిచేస్తామన్నారు. గౌడ జాతి, రాజకీయంగా బలపడే విధంగా వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు, బండి సాయన్నగౌడ్, నాయకులు ఎల్మకంటి మీరయ్యగౌడ్, నకిరేకంటి కాశయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు దొంతురి సైదులుగౌడ్, గోపా సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి



చిట్యాలలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాంచందర్‌రావు

చిట్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీ జేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కోరారు. సోమవారం హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్తున్న ఆయనకు చిట్యాలలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. శాలువాలు, పూలదండలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, కంబాలపలిల్ల సతీష్, మాస శ్రీనివాస్, అశోక్, కన్నెబోయిన మహలింగం, లింగస్వామి, శ్రీను, చంద్రారెడ్డి, వెంకన్న, గోవర్ధన్ పాల్గొన్నారు.

రాంచందర్‌రావుకు ఘనస్వాగతం

నార్కట్‌పల్లి: నల్లగొండలో జరిగే పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు మార్గమధ్యలో నార్కట్‌పల్లి వద్ద ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. రాంచందర్‌రావుతో కరచాలనం చేసేందుకు కార్యకర్తలు ఉత్సాహం చూపారు. బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, కొర్వి శంకర్, మునుకుంట్ల గణేష్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, బిల్లకంటి శ్రీకాంత్, రమేష్, నాగరాజు, సంపత్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎదుగుదలను చూసి ఓర్వలేకనే భౌతికదాడులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటనర్సయ్య

నల్లగొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఎదుగుదలను చూసి ఓర్వలేకనే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడులు చేశారని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల వెంకటనర్సయ్య, పట్టణ అధ్యక్షుడు ఇంద్రయ్య అన్నారు. పట్టణంలోని సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్నపై జాగృతి కార్యకర్తలు దాడిచేసి గాయపరిచారని అదే విధంగా కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు చామల కేశవులు, మారబోయిన చంద్రయ్య, చింతల చంద్రశేఖర్, పందరి వేణు, నాగులపల్లి శ్యాంసుందర్, శ్యామల సత్తయ్య, వీరమల్లు భాస్కర్, రామలింగం పాల్గొన్నారు.

శాలిగౌరారం: బడుగు, బలహీన వర్గాల సమస్యలపై గళం విప్పుతూ వారిని చైతన్యవంతం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి అమానుషమని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ ఉద్యమకారుడు బీసీ సంఘం మండల నాయకుడు భూపతి శ్రీనివాస్ అన్నారు. శాలిగౌరారంలో ఆయన విలేకరులతో మా ట్లాడారు. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎదుర్కోవాలి, తేల్చుకోవాలి తప్ప దాడు లు చేయడం కాదన్నారు. మల్లన్న బీసీ ఉద్యమం వల్లే రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల ఫలాలు దక్కుతున్నాయన్నారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	554 (218.6760)	63,900	1,650
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.48 (3.52)	-	167.79
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	154.034 (19.2030)	-	5,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210


సభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఎన్ని నిధులైనా ఇస్తా..
తుంగతుర్తిని అభివృద్ధి చేస్తా

- తిరుమలగిరి సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- పదేళ్లలో అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం
- నూతన రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం
- హాజరైన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, అడ్లూరి, పొంగులేటి

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట/మోత్కూరు)

కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్న తుంగతుర్తి నియోజకవర్గానికి ఎన్ని నిధులైనా ఇస్తామని, అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్ల అవకాశం ఇస్తే చేయని వారు ఇప్పుడు మాట్లాడుతున్నారని, దేవాదుల ద్వారా గోదావరి జలాలను అందించే వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం విశ్రమించదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతన రేషన్‌కార్డుల పంపిణీని సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సీఎం సోమవారం ప్రారంభించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమా ర్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మొదటగా తిరుమలగిరి పట్టణానికి చెందిన మహ్మద్ రజియా బీతో పాటు మరో 10 మందికి నూతన రేషన్ కార్డులను అందజేశారు. అనంతరం సభలో సీఎం మాట్లాడుతూ ప్రతిపక్షం బీఆర్ఎస్ వైఫల్యాలను ఏకరువు పెడుతూనే విమర్శలను గుప్పించారు. పదేళ్ల మీరు ఎట్లున్నరు అని అడిగినవాళ్లు ఉన్నారా అక్కలు అంటూ తమ ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం చేప ట్టిన పథకాలను వివరించారు.

మహాలక్ష్మి పథకం కింద ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం తమకు ఖర్చు కింద కాదని, ఆడబిడ్డలకు కానుకగా తమ ప్రభుత్వం భావిస్తోందని, సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీలో ఆరు వందల బస్సులు, పెట్రోల్ బంక్‌లు మహిళలకే కేటాయిస్తూ వారిని కోటీశ్వరులను చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. జీరో వడ్డీ కింద రూ.21 వేల కోట్లు అప్పులిప్పిచ్చి, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహకరిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం బెల్ట్ దుకాణాలు తెరిస్తే, తమ ప్రజాప్రభుత్వం రేషన్ దుకాణాలు తెరిచి కొత్త రేషన్‌కార్డులు, సన్నబియ్యం అందించి పేదల కడుపునింపుతోందన్నారు.

ఇది రైతు ప్రభుత్వం

ఎవరు అవునన్నా, కాదన్నా ఇది ముమ్మాటికీ రైతు ప్రభుత్వమేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా రాదని వగల ఏడుపు ఏడ్చిన వారికి తొమ్మిది రోజుల్లో రూ.9 వేలకోట్లు వేసి సమాధానమిచ్చామన్నారు. ఆగస్టు 15నాటికి రూ.21 వేల కోట్లు రుణమాఫీ కూడా పూర్తవుతుందన్నారు. రైతు భరోసా ఎగ్గొడితే బాగుండు, మాపంట పండు అని బీఆర్ఎస్ అనుకుంటే రైతులకు సంక్షేమ పథకాలు అందజేసి వారి కళ్లలో ఆనందాన్ని చూశామన్నారు. రాష్ట్రాన్ని పదేళ్ల పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం ఇవ్వాలన్న ఆలోచన కూడా రాలేదన్నారు.

పదేళ్లు ఏం చేశారు

మూడు రోజులిస్తే గోదావరి

- మిగతా 7వ పేజీలో...



సభకు హాజరైన ప్రజలు, అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన వెంట మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు, ఎంపీ చామల

సన్నబియ్యం, రేషన్‌కార్డులు చరిత్రాత్మక పథకాలు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మోత్కూర్/తిరుమలగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదలకు సన్నబియ్యం, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ చరిత్రాత్మక పథకాలని నీటిపారుదల, పౌరసరఫరాల మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరి సభలో ఆయన మాట్లాడుతూ, గత ఉగాది రోజున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం హుజూర్‌నగర్‌లో ప్రారంభించామని, నేడు రాష్ట్ర వ్యాప్తంగా రేషన్‌కార్డుల కార్యక్రమాన్ని తుంగతుర్తి గడ్డ మీదుగా ప్రా రంభించడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభు త్వం 2.80కోట్ల మందికి రేషన్ బియ్యం ఇవ్వగా, దొడ్డు బియ్యం పేదలు తినేవారు కాదని, రీసైక్లింగ్‌కు...

- మిగతా 7వ పేజీలో..

బీజేపీలోనే సామాన్యులకు అవకాశం

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

నల్లగొండ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఒక్క బీజేపీలో మాత్రమే సామాన్యులకు అవకాశాలు దక్కుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తరువాత తొలిసారి జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన ఆయనకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు మర్రిగూడ బైపాస్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అన్నదమ్ములు, తండ్రీకుమారులు, భార్యభర్తలు పలు పార్టీల్లో చేరి ఎన్నికల్లో పోటీచేస్తూ కుటుంబ పాలన సాగిస్తున్నారని, ఒక్క బీజేపీలో మాత్రం సామాన్యులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ద్వారా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయని ప్రభుత్వంపై కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే ఇచ్చి పేదలకు అన్యాయం చేశారన్నారు. రేషన్ కార్డులను పేదలకు ఇవ్వకుంటే కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పోరాడాలన్నారు. దళారులకు రేషన్‌కార్డులు ఇస్తే ఊరుకునేది లేదన్నారు. ఎస్ఎల్‌బీసీ పేరు చెబుతున్నారు తప్ప ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టును పూర్తిచేయలేదని, అందులో కూరుకుపోయిన మృతదేహాలను వెలికితీయలేని అసమర్థ ప్రభుత్వమన్నారు. రేషన్ కార్డు ఉన్న వారికి 5కిలోల బియ్యం ఇస్తున్నది మోదీ ప్రభుత్వం కాదా? పంచాయతీలకు నిధులు ఇచ్చింది బీజేపీ ప్రభుత్వం కాదా? సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నా రు. అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులు గజమాలలతో రామచందర్‌రావును సత్కరించారు. తొలుత వీటీ కాలనీ శ్రీదేవిభూదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రామచందర్‌రావు దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సమీపంలోని పార్క్‌లో మొక్క నాటారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కాసం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జి.మనోహర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, శానంపూడి సైదిరెడ్డి, చింత సాంబమూర్తి, గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు యాదవ్, పల్లెబోయిన శ్యాంసుందర్, పోతేపాక సాంబయ్య, బొజ్జ నాగరాజు, మిర్యాల వెంకటేశం, దాయం భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్ రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, పోతేపాక లింగస్వామి, కనకాల నాగిరెడ్డి, పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరేనా?

- గత ఏడాది రెండో నంబర్ టర్బైన్ మరమ్మతులు
- ఈ ఏడాది ఒకటో నంబరు టర్బైన్ మరమ్మతు
- వరద వచ్చేనాటికి పూర్తికాని పనులు

ఉభయ తెలుగు రాష్ట్రాలకు వెలుగులు అందించే బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం చేరడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మూడేళ్లుగా ఏదో ఒక టర్బైన్ మరమ్మతులకు గురవుతోంది. వాటి మరమ్మతులు సాగర్‌కు వరద వచ్చే నాటికి పూర్తి చేయాల్సిన జెన్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎగువ నుంచి జలాశయానికి వరద వచ్చాక కూడా మరమ్మతులు పూర్తవడం లేదు. దీంతో జలాశయంలో సమృద్ధిగా నీరున్నా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని మించడం లేదు.

- (ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)



నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్‌లు ఉన్నాయి. అందులో మొదటి టర్బైన్ మన దేశానికి చెందిన బీహెచ్‌ఈఎల్ కంపెనీ రూపొందించింది. కాగా, మిగిలిన ఏడు టర్బైన్‌లు జపాన్ టెక్నాలజీకి చెందినవి. అందులో బీహెచ్‌ఈఎల్ టర్బైన్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 110 మెగావాట్లు కాగా, మిగిలిన ఏడు టర్బైన్ల ఒక్కో దాని సామర్థ్యం 100.6 మెగావాట్లు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 815.6 మెగావాట్లు కాగా, 2023 నవంబరు నెలలో రెండో నంబర్ టర్బైన్ మరమ్మతులకు గురైంది. ఆ టర్బైన్ మరమ్మతులు వెంటనే చేపట్టలేదు. ఏడాదిన్నర తర్వాత టర్బైన్‌కు మరమ్మతులు చేయించగా, తాజాగా ఈ ఏడాది మొదటి టర్బైన్ మరమ్మతులకు గురైంది. దీంతో రూ.7.50కోట్ల వ్యయంతో ఈ ఏడాది ఏప్రిల్ 10న మొదటి టర్బైన్ మరమ్మతు పనులను అధికారులు ప్రారంభించారు. కానీ, నేటికీ ఈ పనులు పూర్తికాలేదు. ఈ టర్బైన్ మరమ్మతులకు మరో నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక ప్రారంభమైంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఎనిమిది టర్బైన్ల ద్వారా ముమ్మరంగా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉండగా, అధికారులు మాత్రం మరమ్మతుల పనుల్లో వేగం పెంచకుండా నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతీ ఏట సాగర్‌కు వరద వచ్చే సమయం నాటికి ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ టర్బైన్ల మరమ్మతులు పూర్తిచేసి, సర్వీసింగ్ చేసి ఉత్పత్తిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి. అయితే జెన్‌కో అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంటాం

ఈ ఏడాది సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని 1,450 మిలియన్ యూనిట్లుగా ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆ లక్ష్యాన్ని చేరుకుంటాం. గత ఏడాది కూడా ఏడు టర్బైన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నాం.

- మంగేష్‌కుమార్, జెన్‌కో సీఈ

ఐదేళ్లలో సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి ఇలా..

సంవత్సరం	లక్ష్యం (మి.యూ)	ఉత్పత్తి (మి.యూ)	వినియోగించిన నీరు (టీఎంసీలు)
2020-21	1290	1248.78	184.15
2021-22	1535	2262.52	335.37
2022-23	1500	2355.62	347.82
2023-24	1400	540.84	95.84
2024-25	1400	1922.26	283.90
2025-26	1450	164.30	28.77

(జూలై 13వ తేదీ నాటికి)

2023-24 ఆర్థిక సంవత్సరంలో సాగర్ జలాశయానికి వరద రాలేదు. దీంతో ఆ ఏడాది ప్రాజెక్టు పరిధిలో క్రాప్ హాలిడే ప్రకటించారు. ఆ ఏడాది ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేదు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా హాఫీజ్‌ఖాన్



నల్లగొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మహ్మద్ హాఫీజ్‌ఖాన్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ హాఫీజ్‌ఖాన్ 1985 నుంచి కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా, పీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా, ఏఐసీసీ సభ్యుడిగా, పీసీసీ స్పోక్ మెంబర్‌గా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలకు ప్రభుత్వం ఆయన్ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంకు, మంత్రులకు పాలనపై అవగాహన లేదు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

మిర్యాలగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సీఎం, మంత్రులకు పాలనపై అవగాహన లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ విమర్శించారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డుల పంపిణీకి సీఎం సభ పెట్టడమేంటని, అదేమైనా కొత్త పథకమా అని ప్రశ్నించారు. కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ నేతలు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని, బడ్జెట్‌లో రూ.20వేల కోట్ల నిధులు కేటాయిస్తామని, ఎం బీసీ సంచార జాతులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి 19నెలలు దాటినా ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనను కేంద్ర ప్రభుత్వం తప్పుపట్టిందన్నారు. చట్టసభలో చేసిన తీర్మానాన్ని కేంద్రం 9వ షెడ్యూల్‌లో పెట్టి పార్లమెంట్‌లో చర్చించి, రాష్ట్రపతి ఆమోదిస్తేనే రిజర్వేషన్ అమలు అవుతుందనే విషయం పాలకులకు తెలియదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదిస్తారా? కోర్టులో నిలబడుతుందా అనేది సందేహమేనని అన్నారు. కవితను అవమానించిన ఎమ్మెల్సీ మల్లన్న బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ2లక్షల కోట్ల రుణం తెచ్చి ఏ ఒక్క కొత్త ప్రాజెక్టును నిర్మించలేదన్నారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ నేతలకు పాలన చేతగాక ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ, నాగార్జునసాగర్‌లో 550 అడుగుల వరకు నీరు చేరిందని, వెంటనే సాగర్ ఎడమకాల్వకు నీరు విడుదల చేసి ఆయకట్టులో సాగుకు తోడ్పాటు అందించాలన్నారు. యాదాద్రి పవర్ ప్లాంటు నిర్మాణంలో భూములు కోల్పోయిన 578 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, దుర్గం పూడి నారాయణరెడ్డి, అన్నబీమోజు నాగార్జునాచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిట్టిబాబు నాయక్, బాలాజీ నాయక్, వీరకోటిరెడ్డి, యూసుఫ్, రవినాయక్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్, తిరందాసు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు, విత్తనాలు అందించాలి

ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య


డీఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎఫ్ నాయకులు

మిర్యాలగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత కిసాన్ సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఏవో శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మట్టయ్య మాట్లాడుతూ, డీలర్లపై రవాణా చార్జీలు విధిస్తుండటంతో వారు ఆ భారాన్ని రైతులపై మోపుతున్నారని అన్నారు. రైతులు ఘన రూపంలో ఉన్న యూరియా వినియోగానికి మొగ్గుచూపుతుండగా, ప్రభుత్వం సగానికి తగ్గించాలని చూస్తోందన్నారు. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో 3లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, 1.5లక్షల టన్నుల ఘన రూప యూరియానే సరఫరా చేసిందన్నారు. నానో యూరియాను తీసుకున్న రైతులకే ఘన రూప యూరియా, డీఏపీ ఇస్తామని లింక్ పెట్టడం సరికాదన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, ధరావత్ మోహన్‌నాయక్, గడ్డి వీరయ్య, లాలునాయక్, మౌనిక, జ్యోతి, సందీప్, శారద, ముత్తయ్య ఇమ్మానియల్, కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ అభివృద్ధి కృషి చేయాలి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


కుంభం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు

నల్లగొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అభివృద్ధికి అధికారులు, ఉద్యోగులు కష్టపడి మంచి ఫలితాలు సాధించాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ మంచి పురోగతిలో ఉందని, అభివృద్ధి దిశలో పయనిస్తున్నా మరింత కష్టపడితే రాష్ట్రంలో మొదటి స్థానానికి చేరుకుంటుందన్నారు. పాలకవర్గ సహకారం, అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో బ్యాంక్ రూ.3వేల కోట్ల టర్నోవర్ దశలో ఉందన్నారు. ఇటీవల నాఫ్స్కాబ్ డైరెక్టర్ పదవితో పాటు పుట్టిన రోజు సందర్భంగా కుంభం శ్రీనివాస్‌రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లుపాశం సంపత్‌రెడ్డి, కొండా సైదయ్య, వీరస్వామి, ధనావత్ జయరాం, కోడి సుష్మ, సీఈవో శంకర్‌రావు, జీఎం నర్మద, తదితరులు పాల్గొన్నారు.

వెంటనే పునరావాసం కల్పించాలి

- చర్లగూడ భూ నిర్వాసితులు
- కట్ట పనుల అడ్డగింత, కార్యాలయం వద్ద దీక్ష


క్యాంపు కార్యాలయం వద్ద నిరహార దీక్ష చేపట్టిన చర్లగూడెం భూ నిర్వాసితులు

మర్రిగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పునారావాసం కల్పించి, ఆర్అండ్ఆర్ చెల్లించాలని చర్లగూడెం భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. సోమవారం కట్ట నిర్మాణ పనులను అడ్డుకొని క్యాంపు కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ, డిండి ఎత్తి పోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న చర్లగూడ రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 2015 గత ప్రభుత్వం పరిహారం చెల్లించినా, పునరావాసం, ఆర్ అండ్ఆర్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రిజర్వాయర్‌తో 335 గృహలు ముంపునకు గురైనట్లు డీఎల్ఐఎస్ సర్వే ద్వారా గుర్తించారన్నారు. అంతకుముందు చర్లగూడెం రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులు నిర్వహిస్తున్న యంత్రాలను భూనిర్వాసితుల కమిటీ అడ్డుకొని పనులను నిలిపివేసింది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఈఈ రాములు, డీఈ కాశీం పోలీసులతో కలిసి కట్ట వద్దకు చేరుకొని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారం రోజుల్లో పరిష్కరిస్తామని, పనులను అడ్డుకోవద్దని నచ్చజెప్పారు. అయినా నిర్వాసితులు వినకుండా న్యాయం జరిగేంత వరకు క్యాంప్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. దీంతో అధికారులు చేసేదిలేక వెనుదిరిగారు. అనంతరం నిర్వాసితులు క్యాంపు కార్యాలయంవద్ద దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో చర్లగూడెం భూనిర్వాసితుల కమిటీ సభ్యులు వల్లముల రాంకోటి, మాదగోని మహేష్, మాదగోని శ్రీనివాస్, కేశవులు, కొండయ్య, బాస్కర్, సుగుణమ్మ, యాదమ్మ సత్తమ్మ, స్వాతి, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టును దర్శించుకున్న ఇంటలిజెన్స్ ఎస్పీ శిరీష


శిరీషకు స్వామివారి శేష వస్త్రాలు అందజేస్తున్న ఈవో

నార్కట్‌పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని ఇంటలిజెన్స్ ఎస్పీ శిరీష కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. తొలుత ప్రధానాలయం జడల రామలింగేశ్వర స్వామి మూలమూర్తి వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానంపై ఉన్న ఇతర ఉపాలయాలను దర్శించుకున్నారు. వారికి చెర్వుగట్టు క్షేత్రం విశిష్టతను ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ వివరించి వేదాశీర్వచనం చేయగా, ఈవో సిరికొండ నవీన్‌కుమార్ సన్మానించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మిర్యాలగూడ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981-83లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. నాలుగు దశాబ్దాల అనంతరం కలుసుకున్న పూర్వమిత్రులు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్య నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో చిట్యాల శ్రీనివాసరావు, చెన్న పాండు, అన్నబీమోజు రమణాచారి, వెంకటరమణ, మల్లయ్య, సత్యం, శ్రీను, సుధీర్, రఘు, అలీ పాల్గొన్నారు.


ఎస్ఐగా నాగేంద్రబాబు బాధ్యతల స్వీకరణ



నేరేడుగొమ్ము, జూలై 14(ఆంధ్రజ్యోతి): నేరేడుగొమ్ము మండల ఎస్ఐగా నాగేంద్రబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన కోటేష్ సూర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్లగొండలో ఎస్ఐగా పనిచేసిన నాగేంద్రబాబు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.

హోటల్ నిర్వహణ ప్రవృత్తి రచన

» హోటల్ నడుపుతున్నా రచనలపై తగ్గని మమకారం » నవలలు రాస్తూ ఆదర్శంగా నిలుస్తున్న యువకుడు



సాయితేజ్‌రెడ్డి రచించిన నమహా, చేతిలో చంద్రుడు పుస్తకాలు

మాడ్గులపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): కుటుంబపరంగా వృత్తి రీత్యా హోటల్ నిర్వహిస్తూ సమయం దొరికినప్పుడల్లా పుస్తకాలను రాస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు సన్నపురెడ్డి మణుసాయితేజరెడ్డి. తనకంటూ ప్రత్యేక చాటుకోవాలనే లక్ష్యంతో ఆ యువకుడు రచనలపై మమకారం పెంచుకొని పుస్తకాలు రాస్తున్నాడు. మొదటి నుంచి ఆ కుటుంబంలో రచయితలు లేకున్నా రచనలపై తనకున్న ఆసక్తి తో ఆ యువకుడిని మంచి రచయితగా నిలబెట్టింది.

తిప్పర్తి మండలంలోని సిలార్‌మియాగూడెం గ్రామంలో ఐదేళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని హోట ల్ నిర్వహిస్తున్న సన్నపురెడ్డి సదాశివరెడ్డి విజయలక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు సన్నపురెడ్డి మణుసాయితేజరెడ్డి చిన్నప్పటి నుంచి చదువులో ప్రతిభ కనబరిచేవాడు. మణుసాయితేజరెడ్డి ఎంకాం పూర్తి చేసి 2021 సంవత్సరంలో హోటల్‌ను ప్రారంభించి జీవనం కొనసాగిస్తున్నాడు.

రాస్తూ పలువురికి ఆదర్శంగా

మణుసాయిరెడ్డి రోజు హోటల్‌లో మేనేజ్‌మెంట్ పనులను చూసుకోవడమే కాక రాత్రి సమయంలో పుస్తకాలు రాయడం అలవాటుగా మార్చుకున్నాడు. దీంతో సమయం దొరికినప్పుడల్లా ఏదో అంశంపై పుస్తకం రాసేవాడు. పాఠకులకు కొత్తదనం అందించాలనే ఉద్దేశ్యంతో 2015-16లో రచయితగా కావాలనే ఆకాంక్ష ఆయన మనస్సులో మెదిలింది. అప్పటి నుంచి కథల ప్రపంచం వైపు అడుగులు వేయడం ప్రారంభించి 2020 సంవత్సరంలో రచనా ప్రవాహంలోకి అడుగుపెట్టాడు. 2021లో ఆయన 'చేతిలో చంద్రుడు' అనే తొలి నవలను రాశాడు. 2022లో 'నమహా', 2025లో మూడవ నవల 'ప్రయాణికుడు' అనే పుస్తకాన్ని రాశాడు. చేతిలో చంద్రుడు అనే పుస్తకాన్ని కుటుంబంలో జరిగే ఇతివృత్తాన్ని ఉదాహరణగా తీసుకోని రాయగా, నమహా పురాణాల మీద, అదేవిధంగా ప్రయాణికుడు అనే పుస్తకాన్ని కర్మ సిద్ధాంతం మీద రాసినట్లు రచయిత పేర్కొంటున్నాడు. తాను రాసిన మూడు పుస్తకాలను పాఠకులను ఎంతో ఆకర్షించాయి. చేతిలో చంద్రుడు అనే పుస్తకం వంద కాపీలు, నమహా పుస్తకం 300 కాపీలు, ప్రయాణికుడు అనే పుస్తకం 50 వరకు పాఠకులు కొనుగోలు చేశారు. మూడవ నవల అయిన ప్రయాణికుడు మణుసాయితేజరెడ్డికి రచయితగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఈ నవల భావోద్వేగాలతో నిండిన జీవితాన్ని మనుషుల మధ్య ఉన్న సూక్ష్మమైన బంధాలను, ప్రశ్నలతో నిండి ఉండే వ్యక్తిగత ప్రయాణాలను పుస్తకంలో పొందుపరిచారు. రచన కేవలం అభిరుచి మాత్రమే కాదు, ఆత్మాభిమానం చాటుకునేలా ఉండాలనేదే తన లక్ష్యమని రచయిత మణుసాయితేజరెడ్డి ఉద్దేశ్యం. కాగా ప్రయాణికుడు అనే నవలను ఇంగ్లీష్‌లో తర్జుమా చేసి ఉత్తర భారతదేశ పాఠకులకు సైతం అందిస్తున్నాడు. సాయి రచించిన పుస్తకాలు అమెజాన్ వంటి ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉన్నాయి.

మంచి రచనలు చేయాలనేదే నా ఆశయం



మంచి రచనలు చేసి మంచి పేరు సాధించడమే నా ఆశయం. పురాణాల పునాదిపై ఆధారపడిన ఆధునిక గొప్ప రచనలు రాస్తాను. అక్షరాల ద్వారా ఆత్మను తాకాలనేదే నా లక్ష్యం. నారచనలద్వారా కొందరికి ఆలోచనలను, శాంతి లభించాలనేదే నా కోరిక. పాఠకుల ఆశీస్సులతో మంచి రచయితగా మారతాను. సినిమాలకు స్టోరీ అందించే అవకాశం వస్తే తప్పకుండా రాస్తాను.

- మణుసాయితేజ్‌రెడ్డి, రచయిత, తిప్పర్తి

ప్రతి విద్యార్థి మొక్క నాటి సంరక్షించాలి


మొక్క నాటుతున్న ఎంఈవో తదితరులు

మిర్యాలగూడ, జూలై 14(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఎంఈవో లావూరి బాలు అన్నారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రకృతి, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు మండలంలోని అలగడప ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్ బహూకరించినట్లు ప్రిన్సిపాల్ కేకే జయరాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో బాలు నాయక్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలను నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్ బహూకరించడం ఆదర్శనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలకు దాతలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమాల్లో ట్రస్మా జిల్లా కార్యదర్శి రవీందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కేకే.జయరాజన్, డైరెక్టర్ జీన్సీ, మమత, మంగమ్మ, రమ, స్వర్ణ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో డిగ్రీ విద్య కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి

మిర్యాలగూడటౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో డిగ్రీ విద్యా సమయం కీలకమని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిరెడ్డి భీమార్జున్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రథమ సంవత్సర విద్యార్థుల స్వాగత సమావేశంలో ఆయన మాట్లాడారు. సంప్రదాయ కోర్సులతో పాటు సాంకేతికత పొందుపరిచిన పాఠ్యాంశాలు డిగ్రీ విద్యలో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా సబ్జెక్టులు ఎంచుకుని, కష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రీడల్లో పాల్గొంటూ జాతీయ సేవా పథకంలో ప్రవేశం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ నరేష్ గుమ్మడి, పడిశాల నాగరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

నిడమనూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతిగృహంలో ఖాళీగా ఉన్న వాచ్‌ఉమెన్ పోస్టును భర్తీ చేసేందుకు డీఈవో ఆదేశాల మేరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో లావూరి వెంకన్న తెలిపారు. ఆసక్తి గల అర్హులైన మహిళలు ఈ నెల 19వ తేదీ వరకు తమ దరఖాస్తులు పాఠశాలలో సమర్పించాలని ఆయన సూచించారు.

వాడపల్లిలో సమస్యలను పరిష్కరించాలి

దామరచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి వినోద్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడపల్లి గ్రామంలోని ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దయానంద్, పిచ్చయ్య, హనుమంతు, ఖాజా మోయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సుకు తరలిన నాయకులు

కొండమల్లేపల్లి: చేయూత పింఛన్‌దారుల జిల్లా సదస్సుకు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ సంఘాల నాయకులు ఎమ్మార్పీఎస్ చింతకుంట్ల గ్రామ అధ్యక్షుడు వస్కుల శ్రీనివాస్‌మాదిగ ఆధ్వర్యంలో సోమవారం బయల్దేరి వెళ్లారు. వెళ్లిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్యమాదిగ, నాయకులు శ్రీను, పెద్దఅంజయ్య, రాములు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి


దేవరకొండలో సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

దేవరకొండ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. దేవరకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం టీపీఆర్టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుండు లక్ష్మణ్, మేకల జాన్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్, లోక్యానాయక్, దామోదర్, బక్కయ్య పాల్గొన్నారు.

● చింతపల్లి: సీపీఎస్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రద్దు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కుర్మేడ్, వీటీనగర్, వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు చింతపల్లి శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పాల్వాయి వాసుదేవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బసవరాజ్ శ్రీనివాస్, నాయకులు మారెడ్డి నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, యాదయ్య, ఝున్సీ, రమాదేవి, పద్మావతి, పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండూరి లక్ష్మణ్, ఎంఈవో నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.ఉదయ, మేకల జానారెడ్డి, నారాయణరెడ్డి, అంజయ్య, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గిరిజన ఉద్యోగుల సంఘం దేవరకొండ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఎంఈవో, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. సోమవారం జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి పాల్గొని ఎంఈవోను సన్మానించారు.

ఎన్నెస్పీ క్రీడామైదాన ప్రహరీ పనులు ప్రారంభం

● అదనపు గేట్లకు పడిన తాళాలు
● హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు, (ఇన్‌సెట్‌లో) ఎన్నెస్పీ క్యాంపు మైదాన అదనపు గేటుకు తాళం వేసిన దృశ్యం

మిర్యాలగూడ టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ క్రీడా మైదాన ప్రహరీ పనులను అధికారులు ప్రారంభించారు. రహదారిలా మారిన క్రీడామైదానం, రయ్ మంటూ దూసుకెళ్తున్న వాహనాలంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టణ పర్యటన సందర్భంగా కాన్వాయ్ ప్రవేశించేందుకు నాడు కూల్చిన క్రీడామైదాన ప్రహరీని నేటికి పునర్నిర్మించకపోవడంతో క్రీడాకారులు మైదానంలో ఆందోళన చేపట్టారు. క్రీడామైదానం రహదారిలా మారింది, వాహనాలు మైదానం మధ్య నుంచి రయ్‌మంటూ వెళ్తున్నాయంటూ జూన్ 11న కథనం ప్రచురించింది. ఇక దశాబ్దాల కాలంగా గ్రౌండ్ అభివృద్ధికి నోచుకోకపోవడంతో క్రీడాకారులు ఆవేదన మేరకు 'ఆటలు ఆడేదెలా..' అంటూ జూలై 5న మరో కథనం ప్రచురించింది. వరుస కథనాలకు అధికారులు స్పందించారు. కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఎస్‌డీవో తదితర అధికార యంత్రాంగం మైదానంలో పర్యటించి అవసరమైన చర్యలకు ఆదేశించగా ప్రహరీ నిర్మాణ పనులు పునఃప్రారంభం కావడంతో పాటు అదనపు గేట్లకు తాళాలు పడటంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ సత్యం

నిడమనూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద ప్రజలకు వరంలాంటిదని నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలకేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4.55 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో దోహదం చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొండా శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగు విజయ్, మంజుల శ్రీనివాస్, ఆలంపల్లి మైసయ్య, కోట్ల సైదులు, రూపని కృష్ణయ్య, జానీపాషా, యాదగిరి, చేగొండి శంకర్, సైదులు, కోట్ల వెంకన్న, గంగాధర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైదానాయక్

దామరచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గిరిజన గురుకుల కళాశాలలను విలీనం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్, మండల కార్యదర్శి వీరన్ననాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేద గిరిజన విద్యార్థులకు విద్యను దూరం చేసేలా ఉందన్నారు. ప్రభుత్వం గిరిజన విద్యార్థులపై సవతి తల్లి ప్రేమను చూపుతుందని ఆరోపించారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి బలోపేతం చేయాలని అన్నారు. విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శివ, కార్తీక్, మహేష్, అశోక్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ అజ్మీరారమేష్

కొండమల్లేపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట రీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ అజ్మీరారమేష్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, సరైన ధ్రువ పత్రాలు లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోవాలాలు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠినంగా వ్యవహరిస్తామని, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ విద్యారంగ

సమస్యలను పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జిల్లెల ఇద్దిరాములు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జిల్లెల ఇద్దిరాములు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఈవో వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దిరాములు మాట్లాడుతూ రాష్ట్రంలోని హాస్టళ్ల సమస్యలకు నిలయాలుగా మారాయని అన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలైన టాయిలెట్స్, మరుగుదొడ్లు, తరగతి గదులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలేదని ఆరోపించారు. ప్రభుత్వ విద్యారం గ సంస్థలను భ్రష్టు పట్టించి ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ కొమ్ము కాస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులను చేర్పించాలని, ప్రచారాలు ఆర్భాటాలే తప్ప ఆచరణలో ముందుకు సాగడంలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పొట్ల రాకేష్, రమేష్, అంజనేయులు, మనోహర్, మహేష్, అరుణ్, శివ, యశ్వంత్, శ్రీకాంత్, నాగరాజు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

● మాజీ ఎమ్మెల్యే నోముల భగత్


మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

తిరుమలగిరి(సాగర్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు దాటినా ప్రజల కు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. రుణమాఫీ, రైతుబంధు, మహిళలకు రూ.2500 భృతి, పింఛన్ల పెంపు వంటి అంశాల్లో విఫలమైందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలో నెల్లికల్ లిఫ్టు ఏర్పాటు ద్వారా సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్ రూపొందించినట్లు తెలిపా రు. ప్రస్తుత ప్రభుత్వం ఆ లిఫ్టును 6వేల ఎకరాలకు పరిమితమయ్యేలా చేయడం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. ఇందిరమ్మ ఇళ్లను అనర్హులకే మంజూరు చేశారని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, వాటి వైఫల్యాల గురించి క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని ఆయన సూచించారు. సమన్వయంతో పనిచేస్తే బీఆర్ఎస్ విజయం ఖాయమని, ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇదే క్రమంలో ఆయన రంగుండ్ల తండాకు చెందిన హోంగార్డు ఆంగోతు కిషన్ గుండెపోటుతో మృతి చెందడంతో అతని ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా అల్వాలకు చెందిన బైరు శ్రీనివాస్ కుమార్తె మానస అకాల మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పిడిగం నాగ య్య, సీనియర్ నాయకులు కేతావత్ బిక్షానాయక్, మేకపోతుల కార్తీక్, వీరబోయిన మల్లిఖార్జున్, కొత్తపల్లి శ్రీను, రామారావు, స్వా మినాయక్, సీతానాయక్, ప్రకాష్, రవి, గోపి, రాజు, గంగరాజు, పురుషోత్తం, కోటేష్, మొగులయ్య, నలబోతు శంకర్, మునగాల జానకిరాములు, పల్‌రెడ్డి రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం ఫలం

హాలియా: హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం హాలియాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీలైన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ప్రజా, రైతు సంక్షేమానికి గాలికి వదిలేసిందని, గ్రామాల్లో స్థానిక ఎన్నికల కోసమే అరకొరగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసిందని విమర్శించారు. గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నాని, అక్రమ కేసులకు భయపడేది లేదని అన్నారు. కార్యకర్తలకు అండగా ఉండి కాపాడుకుంటామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, నాయకులు సురభి రాంబాబు, ఉర్లగొండ వెంకటయ్య, రాములు, ఆవుల సైదులు, చేగొండి కృష్ణ, యడవల్లి నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.